ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 26 సెప్టెంబరు 2024

● వైసీపీ అధినేతను పలువర్గాలు అడ్డుకునే యత్నం?

● భద్రతా ఏర్పాట్లపై పోలీసు యంత్రాంగం మల్లగుల్లాలు


ఒకే వారంలో ముగ్గురు వీఐపీలు


● తిరుమలకు బాబు, పవన్, జగన్ వరుస పర్యటనలు

తిరుపతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తోడు లడ్డూ ప్రసాదాల కల్తీ వ్యవహారం నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మాజీ సీఎం వైఎస్ జగన్ తిరుపతి, తిరుమల వరుస పర్యటనలు తలపెట్టారు. ఒకరి తర్వాత ఒకరుగా.. వారం రోజుల్లో ముగ్గురు కీలక నేతల పర్యటన ఉంది. దీంతో భద్రతా ఏర్పాట్లపై పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4న ప్రారంభం కానున్నాయి. తొలిరోజున శ్రీవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని పాటించేందుకు సీఎం చంద్రబాబు అదే రోజున తిరుమల రానున్నారు. ఇక శ్రీవారి లడ్డూ కల్తీ వివాదం నేపథ్యంలో ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దీక్ష చివరి రోజున తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోనున్నట్టు సమాచారం. ఆయన అక్టోబరు ఒకటిన తిరుపతికి వచ్చి అలిపిరి నడకమార్గంలో తిరుమల వెళతారని, 2న శ్రీవారిని దర్శించుకుని, 3న తిరుపతిలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక లడ్డూ వివాదంలో ఆరోపణలు, విమర్శలు ఎదుర్కొంటున్న మాజీ సీఎం వైఎస్ జగన్ ఈనెల 28న తిరుపతి వచ్చి అలిపిరి కాలిబాటలో తిరుమల చేరుకుని 29న శ్రీవారిని దర్శించుకుంటారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

పోలీసులకు తలనొప్పిగా మారనున్న భద్రతా ఏర్పాట్లు

సీఎం చంద్రబాబు తిరుపతి నుంచీ రోడ్డు మార్గాన తిరుమల చేరుకుని శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించాక వెనుదిరగనున్నారు. సీఎం పర్యటనకు భద్రతా ఏర్పాట్ల పరంగా పోలీసు యంత్రాంగానికి పెద్దగా ఇబ్బందేమీ కనిపించడం లేదు. డిప్యూటీ సీఎం పవన్ పవన్ అలిపిరి కాలిబాటలో వెళితే మాత్రం దారి పొడవునా బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆయనకున్న జనాకర్షణ కారణంగా దారి పొడవునా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాల్సిందే. తిరుమలలోనూ, చివరి రోజు తిరుపతిలో కూడా ఆయన పర్యటనకు బందోబస్తు ఏర్పాటు చేయడం పోలీసులకు కఠిన పరీక్ష కానుంది. ఇక మాజీ సీఎం జగన్ పర్యటన అన్నింటికంటే పోలీసు యంత్రాంగానికి అగ్ని పరీక్షగా మారనుంది. ఎందుకంటే శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీకి ఆయనే కారకుడంటూ పలు రాజకీయ పార్టీలు, హిందూ మత సంస్థలూ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన నడక దారిన వెళితే దారిపొడవునా భద్రత ఏర్పాటు చేయడం ఒక సమస్య అయితే ఆయన్ను పలు పార్టీలు, సంఘాలు, సంస్థలూ అడ్డుకునే అవకాశాలున్నాయి. శ్రీవారి ప్రసాదాలను అపవిత్రం చేసిన వారికి తిరుమల వెళ్లే హక్కు గానీ, శ్రీవారిని దర్శించుకునే హక్కు గానీ లేదని అభ్యంతరపెట్టే అవకాశముంది. ఆయన్ను అడ్డుకునే యత్నాలు శాంతిభద్రతల సమస్యకూ దారితీసే ప్రమాదముంది. ఆ మేరకు పోలీసు యంత్రాంగం భారీ బలగాలను మొహరించాల్సి ఉంటుంది. దీనికి తోడు ముగ్గురు కీలక నేతల పర్యటనలకు విరామం లేకుండా బందోబస్తు విధులు నిర్వర్తించాల్సి ఉండటం పోలీసు యంత్రాంగానికి తలనొప్పిగా మారనుంది.







10 మంది సీఐల బదిలీ

● నలుగురు వీఆర్‌కు రిపోర్టు చేసుకోవాలని డీఐజీ ఆదేశాలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 25: అనంతపురం రేంజ్ పరిధిలో దాదాపు 16 మంది సీఐలు బదిలీ కాగా అందులో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన 10 మంది ఉన్నారు. వీరిలో నలుగురిని వీఆర్‌కు పంపుతూ అనంతపురం రేంజ్ డీఐజీ షీమూషీ బుధవారం ఉదయం ఉత్తర్వులు జారీ చేశారు. వీరందరూ తక్షణం రిలీవ్ అయి వారి వారి స్థానాల్లో చేరాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న మునస్వామిని పుత్తూరు రూరల్‌కు, అక్కడున్న ఎం.భాస్కరనాయక్‌ను వీఆర్‌కు, ప్రస్తుతం తిరుపతి వీఆర్‌లో ఉన్న పి.శ్రీరాములను డీటీఆర్‌బీకి, తిరుపతి ట్రాఫిక్‌లో ఉన్న కె.శ్రీనివాసులను తిరుపతి ఈస్ట్ సర్కిల్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న చిన్న పెద్దయ్యను శ్రీసిటీకి, తిరుపతి ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డిని వీఆర్‌కు, డీటీసీ తిరుపతిలోని ఎ.శ్రీరాముడును తిరుమల టూ టౌన్‌కు, అక్కడున్న సత్యనారాయణను వీఆర్‌కు, చిత్తూరు వీఆర్‌లో ఉన్న కృష్ణమోహన్‌ను పూతలపట్టుకు బదిలీ చేశారు. దీంతో జిల్లాలో సీఐల బదిలీలు దాదాపు పూర్తయ్యాయి.


దేవేంద్రకుమార్

ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐల సస్పెన్షన్

● తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల కేసుల్లో తాజా పరిణామం

తిరుపతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి లోక్‌సభ స్థానానికి 2021 మార్చిలో జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా తిరుపతిలో దొంగ ఓటర్లపై నమోదైన కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలు తాజాగా సస్పెండయ్యారు. వీరిలో తిరుపతిలోని అలిపిరి సీఐలుగా పనిచేసిన దేవేంద్రకుమార్, అబ్బన్న వుండగా ఎస్‌ఐలలో తిరుపతి ఈస్ట్ స్టేషన్ ఎస్‌ఐగా పని చేసిన నాగేంద్ర బాబు, ఎస్వీయూ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా పనిచేసిన సుమతి వున్నారు. 2021 మార్చిలో జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా అలిపిరి పోలీసు స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ అభ్యర్థి పనబాక లక్ష్మి, బీజేపీ నేత శాంతారెడ్డి పలువురు దొంగ ఓటర్లను పట్టుకుని అలిపిరి స్టేషన్‌లో అప్పగించారు. దీనిపై అప్పటి సీఐ దేవేంద్రకుమార్ క్రైమ్ నంబర్లు 217-2021, 218-2021 పేరిట రెండు కేసులు నమోదు చేశారు. అయితే సక్రమంగా దర్యాప్తు చేయలేదు. ఆయన సెలవుపై వెళ్ళడంతో ఆ స్థానంలో సీఐగా వచ్చిన అబ్బన్న కూడా సక్రమంగా దర్యాప్తు చేయలేదు. దొంగ ఓటర్లను విచారించడం గానీ, సీసీ ఫుటేజీలను పరిశీలించడం గానీ, ఆధారాలు సేకరించడం గానీ చేయలేదు. రాజకీయ ఒత్తిళ్ళతో కేసులు రెండూ మూసివేశారు. ఎన్నికల కమిషన్ గత ఫిబ్రవరిలో ఈ కేసులను తిరగదోడి విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈసీ ఆదేశాలతో జరిగిన విచారణలో వీరి నిర్లక్ష్యం నిర్ధారణ కావడంతో తాజాగా ఉన్నతాధికారులు వీరిపై సస్పెన్షన్ వేటు వేసినట్టు సమాచారం. అలాగే ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీబీఆర్ రోడ్డులో దొంగ ఓటర్లు బస్సులో వచ్చి ఓట్లు వేస్తున్నారని అప్పటి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి చేసిన ఫిర్యాదుతో అప్పటి ఈస్ట్ స్టేషన్ ఎస్‌ఐ నాగేంద్ర బాబు క్రైమ్ నంబరు 180-2021 పేరిట కేసు నమోదు చేశారు.అయితే దర్యాప్తు చేయకుండా కేసును నీరుగార్చేందుకు యత్నించారు. తర్వాత బదిలీపై ఎమ్మార్‌పల్లి వెళ్ళిన ఆయన పది రోజుల క్రితం ఈస్ట్ స్టేషన్‌కు వచ్చారు. ఇపుడు సస్పెండ్ అయ్యారు. అదే విధంగా ఎస్వీయూ స్టేషన్ పరిధిలో దొంగ ఓటర్లు వ్యానులో వచ్చి ఓట్లు వేస్తున్నారని నాటి మున్సిపల్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి చేసిన ఫిర్యాదుతో యూనివర్శిటీ స్టేషన్‌లో క్రైమ్ నంబరు 65-2021 పేరిట కేసు నమోదయ్యింది. అయితే దర్యాప్తులో అప్పటి ఎస్‌ఐ సుమతి నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఈసీ ఆదేశాలతో జరిపిన విచారణలో తేలడంతో తాజాగా ఆమెపై సస్పెన్షన్ వేటు పడింది.ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐల సస్పెన్షన్ గురించి జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పీ వెంకట్రావును వివరణ కోరగా ఆయన ధృవీకరించారు.


అబ్బన్న

ఎక్సైజ్ డీసీగా విజయశేఖర్

● తిరుపతి,చిత్తూరు ఈఎస్‌లుగా నాగమల్లేశ్వర రెడ్డి, శ్రీనివాస్

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 25:ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న టి. విజయశేఖర్ నియమితులయ్యారు. చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్‌గా తిరుపతి జిల్లాలోని డిస్టలరీ యూనిట్‌లో పనిచేసిన శ్రీనివాసాచారి,తిరుపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నెల్లూరులో పనిచేస్తున్న నాగమల్లేశ్వర రెడ్డి,తిరుపతి డిస్టిలరీ అసిస్టెంట్ కమిషనర్‌గా అనంతపురం జిల్లాలో విజిలెన్సు విభాగంలో పనిచేస్తున్న ఎన్. బాలకృష్ణ, చిత్తూరు ఈఎస్‌గా తిరుపతి సెబ్‌లో ఈఎస్‌గా పనిచేసిన శ్రీనివాస్ బదిలీ అయ్యారు.తిరుపతిలో ఈఎస్‌గా పనిచేసిన జానకిరాం ఏపీ బ్రూవరలీ కార్పొరేషన్‌కు డిపో మేనేజర్‌గా బదిలీ అయ్యారు. చిత్తూరులో ఈఎస్‌గా పనిచేసిన షేక్ ఆయేషాబేగం బ్రూవరేజ్ యూనిట్‌కు డిపో మేనేజర్‌గా బదిలీ అయ్యారు. వీరంతా త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.గతంలో వైసీపీ ప్రభుత్వం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను సెబ్(స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో), ఎక్సైజ్ పేరుతో రెండు భాగాలుగా విభజించిన విషయం తెలిసిందే.అప్పటి ఎక్సైజ్ సిబ్బందిలో 70 శాతం సెబ్‌కు, 30 శాతం ప్రొహిబిషన్, ఎక్సైజ్‌కు కేటాయించింది. సెబ్‌ను ఏర్పాటు చేసినపుడు డీసీ, ఏసీ పోస్టులను తీసివేసి జిల్లాకు ఒక అధికారిని మాత్రమే నియమించింది.కూటమి ప్రభుత్వం వచ్చాక సెబ్‌ను రద్దు చేసింది. ఎక్సైజ్ శాఖలో గతంలో ఉన్న డీసీ, ఏసీ పోస్టులను తిరిగి ఏర్పాటు చేసింది.


విజయశేఖర్

పోలేరమ్మ తల్లో..!

● వెంకటగిరిలో మొదలైన జాతర సంరంభం
● అర్ధరాత్రి తర్వాత కొలువుదీరిన అమ్మవారి ప్రతిమ
● నేడు భక్తుల మొక్కులు.. దర్శనాలు

వెంకటగిరి/ వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 25: వెంకటగిరిలో బుధవారం పోలేరమ్మ జాతర సంరంభం మొదలైంది. ప్రతి ఇంటి గుమ్మంలోనూ వేప మండలు కట్టారు. దీంతో పట్టణమంతా పచ్చదనం అలుముకుంది. విద్యుద్దీప కాంతులతో వెంకటగిరి వెలుగులీనింది. ఇక, అమ్మవారి పుట్టింటివారైన కుమ్మరి వారు బుధవారం తెల్లవారుజామున వెంకటగిరి చెరువు నుంచి బంకమట్టి తీసుకొచ్చారు. మధ్యాహ్నం తర్వాత కుమ్మరింట ఆ మట్టిని పసుపుతో కలిపి పోలేరమ్మ ప్రతిమ తయారీ మొదలుపెట్టి.. సాయంత్రానికి పూర్తి చేశారు. ఆ ప్రతిమకు కళ్లు, దిష్టి చుక్క ఎటువంటి అలంకారం లేకుండా అక్కడే భక్తుల దర్శనార్థం ఉంచారు. అక్కడ్నుంచి అమ్మవారి ప్రతిమకు తెల్లగుడ్డతో ముసుగు వేసి కట్టెలతో చేసిన పల్లకీపై అమ్మవారికి అత్తవారిల్లుగా భావించే జీనిగలవారి వీధిలోని చాకలింటికి రాత్రి 9.30- 10.30 గంటల మధ్య తీసుకొచ్చారు. మరోవైపు పురవీధుల్లో ఊరేగుతూ పూజలందుకుంటున్న అమ్మవారి బలి దున్నపోతు, ఘటుంకుండలు కాంపాళెం చేరడతో ఘటుం కార్యక్రమం ముగిసింది. కాంపాళెం వద్ద అమ్మవారి అప్ప చెల్లెళ్లుగా భావించే గాలిగంగలకు రాత్రి 11 గంటల సమయంలో పూజలు చేసి అక్కడ పొట్టేలును బలిచ్చి అమ్మవారికి తొలి నైవేద్యం చెల్లించి.. గాలిగంగల సారెలను ముగించారు. అక్కడ్నుంచి గాలిగంగలు బయలు దేరి జీనిగలవారి వీధిలోని చాకలింటికి చేరుకుని అమ్మవారి ముందు నిలిపారు. కోడి తలను నోటితో కొరికి అమ్మవారికి కళ్లు, దిష్టిచుక్కను ఏర్పాటు చేసి ఆభరణాలతో అలంకరించారు. తద్వారా అమ్మవారి ప్రతిమకు ప్రాణప్రతిష్ఠ జరిగి శక్తి స్వరూపంగా సిద్ధమవుతుందని స్థానికుల నమ్మకం. విద్యుద్దీపాలు, పూలతో అలంకరించిన సప్పరంపై అమ్మవారిని కూర్చో బెట్టారు. తర్వాత కరెంట్ సరఫరా నిలిపేశారు. దివిటీల వెలుగులు, ఆసాదుల తప్పెట్లు, యువత చిందుల నడుమ అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి పోలేరమ్మ దేవస్థానం వద్ద వేపమండలతో సిద్ధం చేసిన మండపంలో గురువారం తెల్లవారుజామున కొలువుదీర్చనున్నారు. బద్దె గొర్రెను బలివ్వడంతో తొలి రోజు జారత ముగిసింది.




అమ్మవారి పుట్టినిల్లు వద్ద పోలేరమ్మ ప్రతిమ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



చిన్నారుల మడిభిక్షాలు



పోలేరమ్మకు మడి భిక్షం పెట్టండి.. అంటూ పలువురు చిన్నారులు భిక్షాటనచేసి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున నట్టింట గోడపై ఎర్రమటితో అలికి పసుపు కుంకుమలతో అమ్మవారి ప్రతిమను సిద్ధం చేసి పూజలు చేశారు. అమ్మవారి నైవేద్యంగా సిద్ధం చేసిన అంబలి దబరలను.. అలాగే, మడిభిక్షాలను ఎత్తే వెదురు బుట్టలను, స్టీలు గిన్నెలను వేపమండలు, పసుపు కుంకుమలతో అలంకరించారు. కరవాడు, వంకాయ పులుసును అమ్మవారి ముందు నైవేద్యంగా ఉంచి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఇళ్ల ముంగిట అంబలి దబరలను ఉంచి రోడ్డుపై వచ్చే వారికి అంబలి పోశారు. అనంతరం చిన్నా, పెద్ద, బీదా, ధనిక అన్న తేడా లేకుండా బుట్టలు, గిన్నెలు చేతబట్టి ఇలిల్లూ తిరిగి భిక్షాటన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గతంలో కరువు కాటకాలు వచ్చినపుడు భిక్షాటన చేయగా వచ్చిన డబ్బు, బియ్యంతో కొన్ని రోజులు పూట గడుపుకొనేందుకు ఈ ఆచారం పెట్టారని పెద్దలు అంటారు.


అమ్మవారి విద్యుద్దీపాలంకరణ

నేడు పట్టు వస్త్రాల సమర్పణ

వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించింది. దీంతో గురువారం నిర్వహించనున్న జాతరలో ప్రభుత్వ ప్రతినిధిగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఉదయం 11గంటలకు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు.

జాతరలో నేడు : గురువారం తెల్లవారుజామున పోలేరమ్మ దేవస్థానం వద్ద కొలువు తీరిన అమ్మవారికి వేయికళ్ల దుత్తలతో మొక్కులు తీర్చుకుంటారు. ప్రతి ఇంటి ముంగిట జీవాలను బలిస్తారు. మధ్యాహ్నం తర్వాత అమ్మవారి విరూపోత్సవం కోసం పూలతో అలంకరించిన రథం నగరినుంచి దేవస్థానం వద్దకు రావడంతో విరూపోత్సవం మొదలవుతుంది. పురవీధుల గుండా మల్లయ్య తోటలోని విరూప మండపం వద్దకు చేరుకోగా.. అమ్మవారి ప్రతిమను కత్తితో నరికి విరూపం చేయడంతో జాతర ముగుస్తుంది. ఈ తంతు అంతా అమ్మవారి ప్రతిమ తయారైన 24 గంటల్లో జరగాలన్నది ఇక్కడి ప్రజల నమ్మకం.

జాతరకు రూ.50లక్షల విడుదల

తిరుపతి(కలెక్టరేట్): వెంకటగిరిలో జరుగుతున్న పోలేరమ్మ జాతరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రూ.50లక్షలు విడుదల చేసింది. ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ప్రభుత్వంరూ.50లక్షలు విడుదల చేయాలని జీవో జారీ చేసింది.

నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష
దరఖాస్తులకు గడువుపెంపు

తిరుపతి(కలెక్టరేట్),సెప్టెంబరు25: జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశానికి ఎంపిక పరీక్షలు దరఖాస్తులను గడువును అక్టోబరు 7వ తేదికి పెంచుతున్నట్లు అన్నమయ్య జిల్లా వలసపల్లి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.గోవిందరావు తెలిపారు.ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు నవోదయ.జీవోవి.ఇన్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాల్లో మార్పులు చేసేందుకు చివరి తేదీ అక్టోబరు 8, 9వ తేదీలలో అవకాశం ఉందన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వీఐపీ బ్రేక్ టికెట్ల ఎస్ఎంఎస్ పాట్లు

తిరుమల, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ టికెట్ల పొందే విషయంలో బుధవారం భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాధారణంగా వీఐపీ బ్రేక్ టికెట్ల కోసం భక్తులు సిఫార్సు లేఖలను అదనపు ఈవో కార్యాలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నమోదు చేసుకుంటారు. వాటిని అధికారులు పరిశీలించిన తర్వాత భక్తులు ఇచ్చిన ఫోన్ నెంబరుకు ఎస్ఎంఎస్ వెళుతుంది. ఎస్ఎంఎస్‌లో వచ్చే లింక్ ద్వారా కొంతమంది ఆన్‌లైన్‌లోనే నగదు చెల్లించి టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుంటారు. మరికొందరు ఎస్ఎంఎస్‌ను అదనపు ఈవో కార్యాలయం పక్కనే ఉన్న ఎంబీసీ34 కౌంటర్‌లో చూపించి టికెట్లు కొనుగోలు చేశారు. సాధారణంగా ఈ ఎస్ఎంఎస్‌లు ప్రతి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటలలోపు వస్తాయి. బుధవారం మాత్రం చాలా మంది భక్తులకు రాత్రి 10 గంటలైనా టీటీడీ నుంచి మెసేజ్‌లు రాలేదు. దీంతో కొందరు భక్తులు అదనపు ఈవో కార్యాలయం చుట్టూ తిరిగారు. మరికొందరు ఎంబీసీ వద్దనే నిరీక్షించారు. సాంకేతికలోపం కారణంగా బల్క్‌గా పంపిన ఎస్ఎంఎస్‌లు భక్తులకు చేరలేదని గ్రహించిన అధికారులు ఆగమేఘాలపై చర్యలు తీసుకోవడంతో రాత్రి 10.30 గంటలకు అందరికి ఎస్ఎంఎస్‌లకు చేరాయి. మరికొందరికి అదనపు ఈవో కార్యాలయ సిబ్బంది మ్యానువల్‌గా రాసిఇవ్వడంతో ఎంబీసీలో టికెట్లు పొందారు.

తిరుమలలో తెలంగాణ గవర్నర్



అతిథిగృహంలోకి వెళుతున్న జిష్ణుదేవ్

తిరుమల, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ బుధవారం తిరుమల చేరుకున్నారు. శ్రీకృష్ణ అతిథిగృహం వద్ద ఆయనకు టీటీడీ రిసెప్షన్ అధికారులు భాస్కర్, సత్రేనాయక్ స్వాగతం పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

బీ-ఫార్మసీ ఫలితాలు విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 25: ఎస్వీయూ ఫార్మసీ ఐదవ సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్‌లో నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈ మేరకు సీఈ దామ్లా నాయక్ తెలిపారు.

'సూపర్ సిక్స్' పథకాలు అమలు చేయాలి

● కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ నేతల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 25: ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఈద సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద బుధవారం తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో చేతిలో ప్లేట్లను పట్టుకుని వాయిస్తూ రెండు గంటల పాటు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్డీయే కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి చేయకనే సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. హామీలు అమలు చేసేంత వరకు కూటమి నేతలను నిద్రపోనివ్వమని తెలిపారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడు బాల గురవం బాబు, నాయకులు తమటం వెంకట నరసింహులు, శివశంకర్, సింధుజ, భారతి, మునిసా బేగం, సుప్రజ, చెంగల్‌రాయులు, గోపిగౌడ్, లోకేశ్వర్‌రెడ్డి, కళిందర్, దామోదర్ రెడ్డి, నాని, వెంటకాచలపతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సేవలందించండి

● శ్రీవారి సేవకులతో అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): శ్రీవారిసేవకులు అత్యంత క్రమశిక్షణ, అంకితభావం, భక్తిశ్రద్ధలతో శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు సేవలు అందించడమే కాకుండా యాత్రికులకు అందుతున్న వివిధ సేవలపై అభిప్రాయసేకరణ కూడా చేయాలని టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి పిలుపునిచ్చారు. తిరుమలలోని సేవాసదన్2లో బుధవారం సాయంత్రం జరిగిన సత్సంగ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన శ్రీవారిసేవకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తాము సేవలందించే ప్రాంతంలో భక్తులకు అందుతున్న సదుపాయాలను గమనించి, వాటిపై అభిప్రాయసేకరణ చేసి తమకు అందించాలని కోరారు. అన్‌లైన్‌లో శ్రీవారిసేవ రిజిస్ట్రేషన్‌తోపాటు ఎలక్ట్రానిక్ డిప్ సిస్టం ద్వారా ఆలయ విధుల కేటాయింపులు ఎంతో పారదర్శకంగా జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం శ్రీవారిసేవకులకు ఆయనే స్వయంగా ఈ-డిప్ విధానంలో ఆలయ డ్యూటీని విడుదల చేశారు. అంతకుముందు శ్రీవారి సేవకుల కోసం భజన, ధ్యాన కార్యక్రమాలు జరిగాయి. ఈకార్యక్రమంలో చీఫ్ పీఆర్వో రవి, పీఆర్వో నీలిమ, శ్రీవారిసేవ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, అంతకుముందు బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు అక్టోబరు4వ తేదీన సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పద్మావతి అతిథిగృహం, పాంచజన్యం తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి తనిఖీలు చేశారు.

మా బిడ్డను కాపాడండి

● ఓ తండ్రి వేడుకోలు

తిరుపతి (లీలామహల్), సెప్టెంబరు 25: బోన్ మ్యారో క్యాన్సర్‌తో బాధపడుతున్న తన బిడ్డ అక్షయను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాపాడాలంటూ మస్తాన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఈయనది పిచ్చాటూరు మండలం, ఓబులరాజు కండ్రిగ. 'మా అమ్మాయి అక్షయ మూడేళ్లుగా బోన్‌మ్యారో క్యాన్సర్‌తో బాధపడుతోంది. మొదట స్విమ్స్ రూయాస్పత్రుల్లో చికిత్స చేయించాం. వైద్యులు వేలూరు సీఎంసీకి రెఫర్ చేశారు. ఇప్పటి వరకు రూ.14 లక్షలు ఖర్చు చేశాం. బోన్‌మ్యారో మార్పిడికి రూ.20 లక్షలకుపైగా ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. కూలి పనులు చేసుకునే నాకు అంత స్తోమత లేదు. ప్రభుత్వం, దాతలు సహకరించి నా బిడ్డను కాపాడాలి. వైద్య ఖర్చుకు దాతలు సహాయం చేసేందుకు 96662 56162 నెంబరులో సంప్రదించాలి' అని మస్తాన్ అభ్యర్థించారు.

క్రీడల ద్వారా మానసిక వికాసం



విద్యార్థులతో డీఈవో వి.శేఖర్, డీవైఈవో బాలాజి

తిరుపతి రూరల్, సెప్టెంబరు 25 : విద్యార్థులు చదువుతో పాటు దైనందిన జీవితంలో క్రీడలను భాగస్వామ్యం చేసుకోవాలని, తద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసం వృద్ధి చెందుతుందని డీఈవో డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. ఎమ్మార్‌పల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను బుధవారం డీవైఈవో బాలాజితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. కాగా అండర్-14, 17, 19 జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పలువురు విద్యార్థులు హాజరయ్యారు. హెచ్ఎం వంశీరాజా, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జయరామయ్య, పీడీలు వెంకటముని, సురేష్, జయప్రకాశ్, శ్రీధర్, తైక్వాండో సంఘ సెక్రటరీలు రాజు, శంకర్‌యాదవ్, ధనంజయ, బాలకృష్ణ, అవినాష్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేసిన విద్యార్థిని అభినందిస్తున్న భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 25: ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ విభాగం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రోటరీ క్లబ్‌తో కలిసి వర్సిటీ ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఈ శిబిరం నిర్వహించారు. 50 మంది విద్యార్థులు, టీచింగ్ 10 మంది, నాన్ టీచింగ్ 15 మంది రక్తదానం చేశారు. ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రిలోని తల్లులు, చిన్నారులకు అందించారు. రక్త దాతలను రిజిస్ట్రార్ భూపతి నాయుడు, నిర్వాహకులు అభినందించారు.

రేపు ఎస్వీయూలో యూఆర్సీ మీటింగ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 25: ఎస్వీయూలోని వీసీ చాంబరులో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు యూఆర్సీ మీటింగ్ నిర్వహించనున్నారు. పరిశోధనలకు సంబంధించిన వ్యవహారాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకోనున్నారు.

తిరుపతి ఈస్ట్ సీఐ ఎక్కడ?

● ఫోను స్విచ్‌ఆఫ్, అందుబాటులో లేకపోవడంతో కలకలం
● ఆరా తీసిన పోలీసులు
● చివరకు బెంగళూరులో ఉన్నానని అధికారులకు ఫోన్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 25: తిరుపతి ఈస్ట్ సీఐ మహేశ్వరరెడ్డి మంగళవారం రాత్రి కనిపించకపోవడంతో పోలీసు శాఖలో కలకలం రేగింది. రాత్రి 8.30-9 గంటల వరకు విధుల్లో ఉన్న ఆయన మొబైల్ ఫోను స్విచ్ ఆఫ్ చేసుకుని వెళ్లారు. అధికారిక పని మీద సీఐకి ఇద్దరు అధికారులు ఫోను చేయగా స్విచ్ ఆఫ్‌లో ఉంది. అర్ధరాత్రి వరకు అందుబాటులోకి రాలేదు. ఎస్పీకి ఈ సమాచారాన్ని డీఎస్పీ అందించారు. తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాలు, ఇంటి వద్ద, స్నేహితులు, తెలిసిన వారి ద్వారా ఆరా తీశారు. ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం వరకు ఈస్ట్ సీఐ ఎక్కడున్నారనే విషయం తెలియలేదు. అధికారిక.. వ్యక్తిగత మొబైల్ నెంబర్లు రెండూ స్విచ్ ఆఫ్ వస్తూండటంతో కలకలం రేగింది. ఆ తర్వాత.. తాను అనారోగ్యానికి గురై బెంగళూరు వెళ్లానని తన వ్యక్తిగత మొబైల్ నెంబరు నుంచి డీఎస్పీ వెంకటనారాయణ, మరికొందరు అధికారులకు ఫోన్ చేసి చెప్పినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. దీనిపై మీడియా ప్రతినిధులు కొందరు సీఐకి ఫోన్ చేసి సంప్రదించగా గుండెలో కొంత నొప్పి రావడం, బాధ భరించలేక చికిత్స నిమిత్తం బెంగళూరు వెళ్లానని, ప్రస్తుతం తిరుపతికి వస్తున్నానని చెప్పారు. ఈస్ట్ సీఐ కనిపించకపోవడం వెనుక కారణం.. అనారోగ్యమా లేదా ఇంకేమైనా ఒత్తిళ్లు ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది.

టీటీడీని జగన్ వ్యాపార కేంద్రంగా మార్చేశారు

● శ్రీనివాసానంద సరస్వతి విమర్శ



తిరుపతి(లీలామహల్), సెప్టెంబరు 25: టీటీడీని జగన్మోహన్ రెడ్డి తన పాలనలో వ్యాపార కేంద్రంగా మార్చేశారని ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. తిరుమలను ఎన్నడూ ఆధ్యాత్మిక కేంద్రంగా చూడలేదని, సామాన్యభక్తులకు పెద్దపీట వేయకుండా వారి మంత్రులు, వారి వెంట వచ్చే వందల మందికి సిఫార్సుల దర్శనాలతో బిజీగా గడిపారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హిందూ ధర్మానికి కట్టుబడి ఉన్నారన్నారు. జగన్ ఏనాడూ కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలు సమర్పించలేదని గుర్తుచేశారు. రూ.320కి నెయ్యి పంపిణీ ఎలా సాధ్యమని, టీటీడీలో నిధులు లేవా, దాతలు లేరా అంటూ ప్రశ్నించారు. ప్రతి అంశాన్ని వ్యాపారంగానే చూశారని, చివరకు అన్నదానంలోనూ నాణ్యత లేక కొండపై భక్తులు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ చేయాల్సిన పరిస్థితి నెలకొందని గుర్తు చేశారు. సోనియాగాంధీ, ఏపీజే అబ్దుల్‌కలాం లాంటి వారు డిక్లరేషన్‌పై సంతకం పెట్టి దర్శనం చేసుకున్నారని, మరి జగన్ వద్ద గత పాలకమండలి ఎందుకు డిక్లరేషన్ తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. పాస్టర్లకు జీతాలు ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ గ్రామస్థాయి నుంచి హిందూ దేవాలయాలకు ఎందుకు ఇవ్వలేదన్నారు. నాస్తికుడిని అని చెప్పుకున్న కరుణాకర్‌రెడ్డి కొండపై ఎలా ప్రమాణం చేస్తారని, ప్రజలెలా నమ్ముతారన్నారు. ఐదేళ్లలో 250కిపైగా దేవాలయాలపై దాడులు జరిగాయన్నారు. ఇన్ని ఘటనలు జరిగినా ఏనాడూ ఒక పత్రికా ప్రకటన కానీ, ఒక ఖండనగానీ చేయలేదన్నారు. ఈసమావేశంలో ఓంకార్ హిందూ, తదితర స్వామీజీలు పాల్గొన్నారు.

సైబర్ నేరస్తుడిపై డిప్యూటీ ఈవో ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 25: తిరుపతిలోని విష్ణునివాసం అతిథి గృహంలో భక్తులను ఆన్‌లైన్ మోసాలకు గురిచేసిన భారీ ఎత్తున డబ్బులు దండుకున్న ఓ సైబర్ నేరస్థుడిపై డిప్యూటీ ఈవో విజయకుమార్ బుధవారం ఈస్ట్ డీఎస్పీ వెంకటనారాయణకు ఫిర్యాదు చేసారు. ఫిర్యాదు మేరకు.. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన పి.రాజశేఖర్, మరో ఇద్దరు భక్తులు వేర్వేరుగా.. వేర్వేరు తేదీల్లో ఎం.మూర్తి, టి.వెంకటనారాయణ రెండు నెలల క్రితం శ్రీవారి దర్శనం కోసం తిరుమల వచ్చారు. ఇక్కడ రైలు దిగి సమీపంలోని విష్ణునివాసంలో గదులు అద్దెకు తీసుకున్నారు. అదే సమయంలో ముగ్గురు వేర్వేరుగా లగేజీలు పెట్టుకోవడం కోసం లాకర్లు తీసుకున్నారు. ప్రతి లాకర్‌కు భక్తుడు రూ.600 చొప్పున చెల్లించారు. వారందరూ శ్రీవారి దర్శనం ముగించుకుని తిరిగి తిరుపతికి చేరుకున్నారు. గదులు.. లాకర్లను ఖాళీ చేసి టీటీడీకి చెల్లించాల్సిన నగదు ఆన్‌లైన్ ద్వారా చెల్లించారు. ఆ తర్వాత లాకర్‌లు ఖాళీ చేసుకుని వెళ్లే సమయంలో లాకర్ తీసుకున్నట్లు టీటీడీ ఇచ్చిన రసీదును అక్కడే కింద పారేసి వెళ్ళి పోయారు. దీన్ని ఆసరాగా చేసుకున్న కర్ణాటకలోని ముళబాగల్‌కు చెందిన తిలక్ శ్రీనివాస్ ఆ రశీదులను.. అందులోని నెంబర్ల ఆధారంగా ఆ భక్తులకు ఫోన్లుచేశాడు. 'టీటీడీలో మీరు రెండు నెలల క్రితం లాకర్ తీసుకుని డబ్బులు చెల్లించకుండా వెళ్లిపోయారు. దీనిపై టీటీడీ విజిలెన్సు అధికారులు సీరియస్‌గా తీసుకుని మీపై కేసు నమోదు చేస్తున్నారు. దీని తర్వాత మీకు జీవితంలో దర్శనం, ప్రసాదం, గదులు అంటూ ఇవ్వడం కుదరదు. అవసరమైతే మిమ్మల్ని అరెస్టు కూడా చేయాల్సి వస్తుంది. వెంటనే లాకర్‌కు అవసరమైన డబ్బులు ఆన్‌లైన్ ద్వారా పంపండి. లేకుంటే మీ ఇష్టం' అంటూ ఫోను పెట్టేశాడు. దీంతో ఆ ముగ్గురూ ఆందోళన చెందిన తిలక్ శ్రీనివాస్ ఫోనుపేక రూ.850, 890 చొప్పున పంపారు. ఆ తర్వాత తేరుకున్న భక్తులు తాము నగదు చెల్లించినా ఫోను చేసి బెదిరించింది ఎవరనే దానిపై తర్జనభర్జన పడ్డారు. వెంటనే టీటీడీ విజిలెన్సుకు ఫిర్యాదు చేసారు. దీనిపై విష్ణునివాసం డిప్యూటీ ఈవో విజయకుమార్ మంగళవారం తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణను కలసి ఫిర్యాదు చేయగా ఎస్ఐ నరసింహులను కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని ఆదేశించారు.

డ్రైనేజీ మరమ్మతు పనులు సా...గుతున్నాయ్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 25: తిరుపతి-రేణిగుంట మార్గంలోని నెక్సా షోరూం ఎదురుగా కొన్ని రోజుల క్రితం అండర్ డ్రైనేజీ పైపు లైను ధ్వంసమైంది. దీంతో రోడ్డు వలయాకారంలో కుంగిపోయింది. మరమ్మతు పనులు చేపట్టేందుకు రోడ్డును బ్లాక్ చేసి ట్రాఫిక్‌ను మళ్లించారు. నెలల తరబడి పనులు సాగుతుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది నెలకొంటోంది. తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు.





రేణిగుంట రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్ - మార్గంలో ఏర్పడిన గుంత

ఏదీ ఆ నాట్యమయూరి..



నాట్యం చేస్తున్న నెమలి(ఫైల్ ఫొటో)

రోజూ తమతో మమేకమై మధురానుభూతిని పంచిన ఆ నెమలి కనిపించకపోయేసరికి ఆ ఊరివారంతా తల్లడిలుతుతున్నారు. స్వార్థపరుడి వేటకు బలైపోయిందని తెలుసుకుని జీర్ణించుకోలేకపోతున్నారు. వివరాలిలా.. చంద్రగిరి మండలం మూలపల్లిలో ఓ నెమలి నాలుగేళ్లుగా కలియతిరిగేది. రోజూ తమ మధ్య ఉండటంతో గ్రామస్తులు అనుబంధం పెంచుకున్నారు. అయితే ఒక్కసారిగా ఈ జాతీయ పక్షి కనిపించడం మానేసింది. ఇటీవల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నిర్దాక్షిణ్యంగా చంపి ఆహారంగా మార్చుకున్నాడని తెలిసి వీరంతా మానసికంగా రగిలిపోతున్నారు. ఆ వ్యక్తి ఎవరో తెలిసినా నేరుగా ప్రశ్నించే సాహసం చేయలేకపోతున్నారు. అటవీ శాఖ అధికారులు ఫిర్యాదు చేద్దామన్నా భయాందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు ఈ విషయంపై ఆరా తీసి చర్యలు తీసుకుంటే ఇలాంటి అమానవీయ వేటకు తెరపడుతుందని భావిస్తున్నారు.

- మంగళం

వాహనదారులకు జరిమానా



తనిఖీలు చేస్తున్న అధికారులు

తిరుమల, సెప్టెంబరు 25 (ఆంధ్ర జ్యోతి): సరైన ధ్రువీకరణ పత్రాలు లేని పలువురు వాహనదారులకు తిరుమల పోలీసులు జరిమానా విధించారు. తిరుమలలో బుధవారం తిరుపతి ఆర్టీవో విభాగం ఏఎంవీఐ ప్రసాద్‌వర్మ, ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ సిబ్బందితో కలిసి జీఎన్సీ టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని ఏడుగురికి రూ.45,700 జరిమానా విధించారు. నిబంధనల మేరకే వాహనాల్లో భక్తులను ఎక్కించాలని, వైట్ బోర్డు ఉన్నవారు ట్యాక్సీ నడపరాదని స్పష్టం చేశారు. ఘాట్ రోడ్లలో నిర్దేశిత సమయం పాటించాలన్నారు.

రేపు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



మాట్లాడుతున్న డీఈవో శేఖర్

చంద్రగిరి, సెప్టెంబరు 25: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని డీఈవో శేఖర్ అన్నారు. శుక్రవారం చంద్రగిరి కోటలో సౌండ్ అండ్ లైటింగ్ షోను ప్రారంభించనున్న నేపథ్యంలో ఆయన బుధవారం చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మండలంలోని హెచ్ఎంలతో సమావేశమయ్యారు. చంద్రగిరి కోట చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని సూచించారు. డీవైఈవో బాలాజీ మాట్లాడుతూ శుక్రవారం వెయ్యి మంది విద్యార్థులతో చంద్రగిరి టవర్ క్లాక్ నుంచి కోట వరకు ర్యాలీ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు పాల్గొన్నారు.

చింతగుంటలో 'పొలం పిలుస్తోంది'



ఎర్రావారిపాలెం, సెప్టెంబరు 25 : మండలంలోని చింతగుంట గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు వరి, వేరుశనగ, మామిడి పంటలను పరిశీలించి రైతులకు సాగుపై నూతన సాంకేతిక వివరాలు వివరించారు. రసాయన ఎరువుల వాడకం వల్ల అనర్థాలు, సేంద్రియ సాగు సత్ఫలితాలు, నేటి మార్కెట్ డిమాండ్‌ను తెలియజేశారు. జీవామృతం తయారీ, ప్రకృతి సేద్యం సాగు వివరాలను ఆదర్శ యువ రైతు సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఖాదర్ బాషా, పశువైద్యాధికారి ఎం.కృష్ణ, సర్పంచ్ దేవేంద్ర, మార్కెట్ యార్డ్ ప్రతినిధి భాస్కర్ పాల్గొన్నారు.

చంద్రగిరి కోటను సందర్శించిన కలెక్టర్



చంద్రగిరి, సెప్టెంబరు 25: చంద్రగిరి కోటను బుధవారం రాత్రి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సందర్శించారు. శుక్రవారం సౌండ్ అండ్ లైటింగ్ షోను వర్చువల్ విధానంలో సీఎం చంద్రబాబు ప్రారంభించనున్న నేపథ్యంలో కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్‌తో పాటు అధికారులు, నాయకులు ఉన్నారు.

జాతీయ విద్యావిధానంతో ఒరిగిందేమీలేదు



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 25: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానంతో ఒరిగిందేమీ లేదని ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఏఐఎస్ఈసీ) రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్రహ్మణ్యం, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు ఎ.హరీష్ చెప్పారు. ఏఐఎస్ఈసీ ఆధ్వర్యంలో 'జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ-2020) అమలు, నేటి విద్యావ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలు, మనముందున్న కర్తవ్యాలు' అంశాలపై తిరుపతిలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సదస్సులో వీరు ప్రసంగించారు. జాతీయ విద్యావిధానం ద్వారా ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతమౌతోందనడం బూటకమన్నారు. నాలుగేళ్ల డిగ్రీతో ప్రయోజనమేమీ లేదని, ఇప్పటికే సెమిస్టర్ విధానంతో దెబ్బతిన్న డిగ్రీ విద్యలో సింగిల్ మేజర్, మైనర్ సబ్జెక్టులంటూ మరింత అస్తవ్యస్తం చేశారన్నారు. సీఎస్‌పీ ఇంటర్న్‌షిప్ పేరుతో విద్యార్థులకు విషయ పరిజ్ఞానం అందకుండా చేసి మొత్తం డిగ్రీ వ్యవస్థను ధ్వంసం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. యూనివర్శిటీల్లో ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయకుండా ఉన్న డిపార్ట్‌మెంట్లనన్నింటినీ మూసేస్తూ సర్వనాశనం చేశారని విమర్శించారు. అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సందర్భంగా ఆలిండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ముద్రించిన 'అల్లూరి జీవిత-పోరాటం-యువతకు ఆదర్శం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థి సంఘాల నేతలు శ్రీకాంత్, అమీనా, మహేష్, నవీన్, డిల్లీ, మహేశ్వర్, వెంకటేశ్ తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

షార్‌లో సతీష్ ధావన్ జయంతి



సతీష్ థావన్ విగ్రహం వద్ద షార్ డైరెక్టర్, ఉద్యోగులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 25: ఇస్రో మాజీ చైర్మన్ ప్రొఫెసర్ సతీష్ ధావన్ జయంతిని బుధవారం షార్‌లో నిర్వహించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ చేతుల మీదుగా షార్‌లోని మిషన్ కంట్రోలర్ సమీపంలో ఉన్న సతీష్ ధావన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ మాట్లాడుతూ శ్రీహరికోటలోని షార్ కేంద్రం ఏర్పాటుకు సతీష్ ధావన్ ఎనలేని కృషి చేశాడని కొనియాడారు. అనంతరం షార్ వైద్యశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 123 మంది రక్తదానం చేశారు. సూళ్లూరుపేట షార్ ఉద్యోగుల కాలనీ పులికాట్ నగర్ కేఆర్‌పాలెం ఉన్న సతీష్ ధావన్ మెమోరియల్ హాస్పిటల్‌లో ధావన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులు రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ అహ్మద్, గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

యాదవ వీధిలో ఎటుచూసినా చెత్తే



తిరుపతి(యాదవవీధి), సెప్టెంబరు 25: నగరంలోని యాదవ వీధిలో ఎటుచూసినా చెత్తే దర్శనమిస్తోంది. అక్కడి ప్రజలు చెత్త రోడ్లపైనే పోస్తుండడం, పారిశుద్ధ్య కార్మికులు సకాలంలో తొలగించకపోవడంతో కుప్పలు, కుప్పలుగా చెత్త నిండిపోయింది. కుక్కలు చెత్తను రోడ్లపైకి ఈడ్చుకెళుతుండడంతో పారిశుధ్యం లోపిస్తోంది. పైగా వర్షానికి చెత్త కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు ప్రబలి రోగాలకు దారి తీస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గమ్యం చేరుస్తాయా..?

● తరచూ ఆగిపోతున్న మెట్రో బస్సులు



సోమవారం ఆటోనగర్ వద్ద ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 25: ఏపీఎస్ ఆర్టీసీ జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్(మెట్రో)బస్సులు తరచూ ఆగిపోతుండడంతో ప్రయాణికులు అవస్థలు పడాల్సి వస్తోంది. తాజాగా సోమవారం ఉదయం ఓ బస్సు ఆటోనగర్ సమీపంలో ఆగిపోయింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా కదలకపోవడంతో ప్రయాణికులను మరో బస్సు ఎక్కించి పంపించాల్సి వచ్చింది. 2013లో కేంద్ర ప్రభుత్వం రాయితీ ద్వారా రాష్ట్రానికి పొడవాటి మెట్రో బస్సులను అందజేసింది. జిల్లా వాటా కింద 23 బస్సులు వచ్చాయి. కొత్తల్లో వాటిని జిల్లాలోని ప్రధాన ప్రాంతాలకు తిప్పారు. పొడవు అధికంగా ఉండడం, పాతపడడం వంటి కారణాలతో ఐదేళ్ల క్రితం శ్రీకాళహస్తి డిపోకే 23 బస్సులను కేటాయించారు. అప్పటి నుంచి వన్‌మేన్ సర్వీసు రూపంలో ఆ బస్సులు తిరుపతి-శ్రీకాళహస్తి మధ్య తిరుగుతున్నాయి. వాటి జీవితకాలం దాదాపుగా ముగియడంతో తరచూ మొరాయిస్తున్నాయి. తద్వారా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ బస్సులు ఇలానే కొనసాగితే అనేక సమస్యలు ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

34 మంది ఎంపీడీవోల బదిలీ

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 25: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 34మంది ఎంపీడీవోలను బదిలీ చేస్తూ జడ్పీ సీఈవో గ్లోరియా ఉత్తర్వులు జారీ చేశారు. రామచంద్రాపురం ఎంపీడీవోగా ఇందిరమ్మ, ఎర్రావారిపాళ్యానికి అరుణ, బైరాలకు ధనలక్ష్మి, గుడిపాల కు శివరాజు, కురబలకోటకు గంగయ్య, మదనపల్లెకు తాజ్ మస్‌రూర్, చిత్తూరుకు కెశ్రీనివాసులు, పిచ్చాటూరుకు మహ్మద్‌రఫీ, కలకడకు అబ్దుల్ రహీం, కార్వేటినగరానికి చంద్రమౌళి, వడమాలపేటకు శేషగిరిరావు, కలికిరికి భానుమూర్తి రావు, తొట్టంబేడుకు సురేంద్రనాథ్, గంగవరానికి సురేష్‌బాబు, కేవీపల్లికి సుధాకర్, పెద్దపంజాణికి కేఎన్ బాలాజీ, సోమలకు అబ్దుల్ కలామ్ ఆజాద్, వెదురుకుప్పానికి అమరనాధ్, పూతలపట్టుకు నాగరాజు, ములకలచెరువుకు హరి నారాయణ, రామసముద్రం ఎంపీడీవోగా భానుప్రసాద్ బదిలీ అయ్యారు.నిమ్మనపల్లె ఎంపీడీవోగా పరమేశ్వరరెడ్డి, రొంపిచెర్లకు మధుసూదనరెడ్డి, శాంతిపురానికి ప్రేమ్‌రాజ్‌కుమార్, గుడుపల్లికి లీలా మాధవి, తిరుపతి రూరల్‌కు రామచంద్ర, రేణిగుంటకు రమేష్‌బాబు, చిన్నగొట్టిగల్లుకు గిడ్డయ్య, తంబళ్ళపల్లికి ఉపేంద్రరెడ్డి, పీలేరుకు శివశంకర్, పీటీఎం ఎంపీడీవోగా విష్ణు చిరంజీవి బదిలీ అయ్యారు. నాగలాపురం ఎంపీడీవోగా బాలాజీ నాయక్, ఏర్పేడుకు సౌభాగ్యం, రామకుప్పం ఎంపీడీవోగా లక్ష్మీకాంత్‌లను బదిలీ చేశారు. మిగిలిన 31మండలాల విషయానికి వస్తే 17 మండలాల్లో ఏవోలు, ఈవోఆర్డీలు ఇన్‌చార్జి ఎంపీడీవోలుగా వ్యవహరిస్తున్నారు. 14 మండలాల్లో ఎంపీడీవోలకు అక్కడ ఐదేళ్ల సర్వీసు పూర్తి కాకపోవడంతో వారంతా అక్కడే ఉన్నారు.

కల్తీనెయ్యి కారకులకు శిక్ష తప్పదు


హోమంలో ఎమ్మెల్యే శ్రీనివాసులు దంపతులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 25: శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యికి కారకులైన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా ఆటోనగర్‌లోని శివాలయంలో మహాహోమం నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులకు అర్చకస్వాములు పూర్ణకుంభం స్వాగతం పలికారు. మహాహోమం క్రతువును ఉదయం 10నుంచి 11.30గంటల వరకు శాస్త్రోక్తంగా నిర్వహించి, పూర్ణాహుతితో ముగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీవారి లడ్డూ ప్రసాదాల్లో జంతుకొవ్వుతో కూడిన నెయ్యి వినియోగంతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నా యన్నారు. ఇందులో మాజీ సీఎం జగన్‌రెడ్డి, టీటీడీ మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డిల పాత్ర ఉందని, వారికి శిక్ష తప్పదని స్పష్టం చేశారు. దేవుడిని నమ్మని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కోనేటిలో మునిగి ప్రమాణం చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న కోనేరును ఆయన అపవిత్రం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి, నాయకులు పొలకల మల్లికార్జున్, కీర్తన, గోపి, ధనలక్ష్మి, ఆదినారాయణ, మోహన్‌రఎడ్డి, రవి, మంజుల, మణిరాయల్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల కల్తీమయం : జనసేన

తిరుపతి (లీలామహల్), సెప్టెంబరు 25: గత వైసీపీ ప్రభుత్వంలో తిరుమలను కల్తీమయం చేశారని జనసేన నేత పూల రఘురాం ఆరోపించారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో టీటీడీ పాలకమండలి ద్వారా శ్రీవారి ఖజానాను లూటీ చేసిందన్నారు. సమాజం కూడా కల్తీ అయిందన్నారు. ప్రజారాజ్యం పార్టీ నేటి వరకు కొనసాగి ఉంటే చిరంజీవి సీఎం అయి ఉండేవాడని జోస్యం చెప్పారు. దోపిడీ పార్టీలను దూరం పెట్టాలని కోరారు.

పార్కింగ్ కోసం మాస్టర్ ప్లాన్ రోడ్లా?


35వ డివిజన్లో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణతో కలసి పర్యటిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్లు, జీపులు పార్కింగ్ చేసుకోవడం కోసం మాస్టర్ ప్లాన్ రోడ్లు వేసినట్లు ఉన్నారని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బుధవారం 35వ డివిజన్లో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణతో కలసి ఆమె పర్యటించారు. టీటీడీ ఏడీ బిల్డింగ్ పక్క వీధిలో కాలువపై నిర్మించిన రోడ్డులో వాహనాలు పార్కింగ్ చేసి ఉండడాన్ని గమనించారు. నగరంలో కొత్తగా వేసిన మాస్టర్ ప్లాన్ రోడ్లు, విస్తరణ రోడ్లలో వాహనాలను ఇష్టమొచ్చినట్టు పార్కింగ్ చేస్తున్నారని, అలాంటి వాహన యజమానుల నుంచి ఫీజులు వసూలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. స్థానిక మహిళలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నాగభూషణం, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్వీఎం శ్రీధర్, జగ్గ, నాయకులు శ్రీలక్ష్మి, చిన్ని, షైనం సురేష్, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీని శుభ్రం చేయండి


ఓపెన్‌గా ఉన్న అండర్ డ్రైనేజీ

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 25: విష్ణునివాసం ముందు ఆర్టీసీ బస్సుల పార్కింగ్ స్థలంలో అండర్ డ్రైనేజీ నుంచి దుర్వాసన వస్తోందని, వెంటనే దాన్ని శుభ్రపరచాలని ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది కోరుతున్నారు. ఈ ప్రాంతం నుంచి ప్రతి నిత్యమూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆరు నెలల క్రితం డ్రైనేజీ బ్లాక్ అవడంతో ఫుట్‌పాత్‌ను ధ్వంసం చేసి, అడ్డుగా ఉన్న వ్యర్థాలను తొలగించారు. ఆ తర్వాత మరమ్మతులు చేయకుండా వదిలేశారు. మురుగు నీరు నిల్వ ఉండి, దుర్వాసన వెదజల్లుతుండడంతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న శంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 25: టీడీపీ సీనియర్ నేత కందాటి శంకర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు బుధవారం మధ్యాహ్నం రుయా ఆస్పత్రి ఎదుట అన్నదానం చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కుమారులు కందాటి సురేష్‌రెడ్డి, కందాటి మిథున్‌రెడ్డి, పలువురు అభిమానులు పాల్గొన్నారు.

ధరలకనుగుణంగా కూలి పెంచాలి


నిరసన తెలుపుతున్న సివిల్ సప్లయిస్ కార్మికులు

తిరుపతి (కలెక్టరేట్), సెప్టెంబరు 25: పెరిగిన ధరలకనుగుణంగా సివిల్ సప్లయిస్ హమాలీలకు కూలి రేట్లు పెంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు తిరుపతి మామిడి కాయల మండీ వద్ద ఉన్న సివిల్ సప్లయిస్ గోదాము వద్ద హమాలీలతో కలిసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కార్మికులకు పాత అగ్రిమెంట్ 9 నెలల క్రితం ముగిసిందన్నారు. నూతన అగ్రిమెంట్ చేయడానికి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. జీతాలు సకాలంలో ఇవ్వడంలేదని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎన్‌డీ రవి, హమాలీ సంఘం నేతలు చెంచుకృష్ణయ్య, ముత్తు, పళని, శేషాద్రి, గణేష్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 30మందికి జరిమానా

తిరుపతి(లీగల్), సెప్టెంబరు 25: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 30మంది నిందితులకు రూ.3లక్షలు జరిమానా విధిస్తూ 4వ అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున విధించినట్లు పేర్కొన్నారు.

సిద్ధార్థలో సైబర్ క్రైమ్‌పై అవగాహన

తిరుపతి రూరల్, సెప్టెంబరు 25: తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సైబర్‌క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన పి.మాధవరెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు మొబైల్ బ్యాంకింగ్ ద్వారా ఆర్థిక వివరాల సమాచారాన్ని సేకరిస్తున్నారని, దీనిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్‌క్రైమ్‌ను నియంత్రించే విధానాలను పేపర్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కాగా సైబర్ ఎటాక్ జరిగిన వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 18002096789కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కళాశాల ఛైర్మన్ వై.కొండారెడ్డి, డైరెక్టర్లు వై.ఆనంద్‌రెడ్డి, వై.విజయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎస్.భాస్కర్, పీఆర్వో పి.స్వామినాథన్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికలు వాయిదా

ఓడిపోతామన్న భయంతోనే వాయిదా వేశారన్న వైసీపీ కార్పొరేటర్లు


ధర్నా చేస్తున్న మేయర్ శిరీష, వైసీపీ కార్పొరేటర్లు

తిరుపతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలను పరిపాలన కారణాల (అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్)వల్ల వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ మౌర్య ప్రకటించారు. కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌కు గడువు తీరిపోయిన నేపథ్యంలో ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, విత్‌డ్రా ప్రక్రియ ముగించుకుని వచ్చే నెల 4న ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుమల పర్యటన, శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేయాలని కూటమి పార్టీ కార్పొరేటర్లతో పాటు పలువురు వైసీపీ కార్పొరేటర్లు మంగళవారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న మరికొంత మంది వైసీపీ కార్పొరేటర్లు బుధవారం నామినేషన్లు వేసేందకు నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చారు. కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో మేయర్ డాక్టర్ శిరీషతో కలసి కార్యాలయం ముందు కొద్దిసేపు నిరసన తెలిపారు. ఓడిపోతామన్న భయంతోనే ఎన్నికలు నిర్వహించేందుకు అధికార పార్టీ వెనకడుగు వేస్తోందని విమర్శించారు. ఇంతలోనే ఎన్నికలను వాయిదా వేస్తున్నట్టు కార్పొరేటర్లకు వాట్సప్‌లో సవరణ నోటిఫికేషన్ రావడంతో అక్కడ నుంచి వెనుదిరిగారు. కాగా వైసీపీ స్థానిక నాయకత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా ఎన్నికలు వాయిదా వేయాలని కోరిన ఆ పార్టీ కార్పొరేటర్లపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఎర్రచందనం స్వాధీనం - ఒకరి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

మంగళం, సెప్టెంబరు 25: నెల్లూరు జిల్లా రాపూరు అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం మంగళవారం రాత్రి రాపూరు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించింది. గోనుపల్లి ప్రాంతంలోని చాటగిరి చెలల వద్ద కొందరు మోటారు సైకిల్‌పై వెళుతూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని చుట్టుముట్టడంతో ఒకరు దొరికారు. మిగిలిన వారు పారిపోయారు. పట్టుబడ్డ వ్యక్తి గోనుపల్లికి చెందిన వాడిగా గుర్తించారు. సమీపంలోని 15 ఎర్రచందనం దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.45కోట్లు


హుండీ కానుకలను లెక్కిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,45,87,352 వచ్చింది. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద హుండీ లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీలతో పాటూ పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా 68 గ్రాముల బంగారం, 421.200కిలోల వెండి, విదేశీ కరెన్సీ 3,452 వచ్చింది. 28 రోజుల వ్యవధిలో ఈ ఆదాయం వచ్చినట్లు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. లెక్కింపులో ఆలయాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొడిదిపల్లి సమీపంలో చిరుత కలకలం



కల్లూరు, సెప్టెంబర్ 25: పులిచెర్ల మండలం 102 రామిరెడ్డిగారిపల్లి పంచాయతీ కొడిదిపల్లి సమీపంలో బుధవారం సాయంత్రం చిరుత పులి సంచారం కలకలం రేపింది. బుధవారం సాయంత్రం 5:30 గంటల సమయంలో ధర్మవరం నుంచి నరసాపూర్‌కు ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్లాల్సి వుండడంతో కొడిదిపల్లి వద్ద గేట్‌మాన్ బాలాజీ రైల్వేగేట్ మూశాడు. అదే సమయంలో పట్టాలను చిరుత పులి దాటుతుండడాన్ని గమనించాడు. వెంటనే తన మొబైల్‌లో చిరుత సంచార దృశ్యాలను వీడియో తీశాడు. గ్రామానికి చెందిన బాలకృష్ణమరాజు మామిడితోటలోకి చిరుత వెళ్లే దృశ్యాలను వీడియో తీసి స్థానిక ప్రజలను అప్రమత్తం చేశాడు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు

తిరుమల, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక మంగళవారం 67,616 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,759 మంది తలనీలాలు సమర్పించారు.

అన్ సీజన్‌లో విరగ్గాసిన మామిడి



వేసవికాలం అనగానే మనం దరికీ ఠక్కున గుర్తుకొచ్చేది మామిడిపండ్లు.అయితే అన్ సీజన్‌లో ఈ మామిడితోట పూత, పిందెలతో కళకళలాడుతోంది.పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కోటపల్లి సమీపంలోని మనోహర్‌కు చెందిన ఈ తోటలో మామిడి దిగుబడి ప్రత్యేకత చాటుతోంది. సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లో మామిడి పూతలు వస్తాయి. వేసవికాలంలో పూర్తిస్థాయి పంట దిగుబడి వస్తుంది.అటవీ ప్రాంతానికి సమీపంలో మనోహర్‌కు చెందిన రెండెకరాల్లో వంద మామిడిచెట్లున్నాయి.ఈ ఏడాది సీజన్‌కు ముందే పూత రావడంతో రెండు పర్యాయాలు మందులు పిచికారి చేశాడు. దీంతో పూత, పిందెలు, కాయలతో చెట్లు కళకళలాడుతున్నాయి.అకాల వర్షం, ఈదురుగాలులు రాకపోతే సుమారు 4 నుంచి 5 టన్నులు కాయలు దిగుబడి వచ్చే అవకాశముందని, ధరలు కూడా బాగుంటాయని మనోహర్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు.

- కల్లూరు

పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన



ఎమ్మార్‌పల్లి, సెప్టెంబర్ 25 : పంటల సాగులో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం తిరుపతి రూరల్ మండలం తనపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పనిముట్లు, టార్పాలిన్ పట్టలు, పీవీసీ పైపులు తదితరాలు రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రామంలో డ్రమ్ సీడర్‌తో సాగు చేసిన వరి పైరును పరిశీలించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు మనోహర్, ఏవోలు మమత, హర్షిత పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యువజన సంఘాల నేతలు, విద్యార్థినులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 25: మహిళలు, విద్యార్థినులపై దాడులను, అత్యాచారాలను అరికట్టాలని నాన్ పొలిటికల్ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. తిరుపతిలోని చైతన్య మహిళా రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో బుధవారం జేఏసీ సమావేశం నిర్వహించారు. సేవ్ ఉమెన్ పోస్టర్లను సంఘాల నేతలు ఆవిష్కరించారు. యువజన సంఘాల నేతలు ఓబులేశు, జయరాజు, బయన్న మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలు, విద్యార్థినులపై శారీరక, లైంగిక దాడులు ఎక్కువయ్యాయన్నారు. అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, పకడ్బందీ చర్యలు చేపట్టాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కళాశాల డీన్ శ్రావణి, ఏవో, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

సీఎంకు రవినాయుడు కృతజ్ఞతలు


చంద్రబాబును సత్కరిస్తున్న రవినాయుడు

తిరుపతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్‌గా నియమితులైన అనిమిని రవినాయుడు బుధవారం సీఎం చంద్రబాబును సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు శాప్ ఛైర్మన్ పదవిని కేటాయించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో క్రీడా రంగం పూర్తిగా పడకేసిందని, విద్యార్థులు, యువత క్రీడలకు దూరమయ్యారని ఈ సందర్భంగా సీఎం వివరించగా పూర్వవైభవం తీసుకొస్తానని రవినాయుడు అన్నారు. తనపై పెట్టిన గురుతర బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని చెప్పారు.

ఎస్వీయూ బీఈడీ కాలేజీలో దసరా వేడుకలు


సంబరాల్లో ప్రిన్సిపాల్ జానకిరామయ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 25: ఎస్వీ యూనివర్సిటీలోని బీఈడీ కాలేజీలో దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జానకిరామయ్య నేతృత్వంలో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, వేడుకల్లో పాల్గొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి దసరా పండుగ ప్రతీక అని ప్రిన్సిపాల్ అన్నారు. దుర్గాదేవి అనుగ్రహం అందరికీ కలగాలని ఆకాంక్షించారు.

ఘనంగా దీనదయాళ్ జయంతి



తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 25: పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 108వ జయంతిని బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. కేంద్ర తపాలా కార్యాలయం వద్ద దీనదయాళ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ఉన్నతి కోసం పాటుపడిన మహనీయుడు, దార్శనికుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని పేర్కొన్నారు. పార్టీ నాయకులు కట్టమంచి చంద్రబాబుయాదవ్, సుబ్రహ్మణ్యంరెడ్డి, చెంగల్‌రాయులు, నాదముని, గురునాథ నాయుడు, యువరాజు, పద్మనాభం పాల్గొన్నారు.

రమణకు పలువురి శుభాకాంక్షలు


రమణకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 25: టీటీడీ మాజీ డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. వరదరాజనగర్‌లోని ఆయన స్వగృహంలో జరిగిన జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, తిరుపతి ఇన్‌చార్జ్ సుగుణమ్మ, సినీ నిర్మాత ఎన్వీప్రసాద్ హాజరయ్యారు. కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వూకా విజయ్‌కుమార్, చీర్ల కిరణ్, మహేష్ యాదవ్, రామకృష్ణ, తంగవేలు, సూరిబాబు, విజయ్‌కుమార్, జేబీ శ్రీనివాస్, టీటీడీ ఉద్యోగులు, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

అటవీ శాఖలో వాహనాల వేలం

మంగళం, సెప్టెంబర్ 25 : తిరుపతి అటవీ శాఖ పరిధిలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన వాహనాలను బుధవారం వేలం వేశారు. 50వాహనాలను వేలం వేయగా 49 అమ్ముడుపోయాయి. తద్వారా అటవీ శాఖకు రూ.17,78,510 ఆదాయం వచ్చినట్లు తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్‌రెడ్డి తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 25: నగర పరిధిలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సాయంత్రం నెహ్రూనగర్ ఐఎస్ మహల్ వద్ద 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించి మిల్లెట్స్, ఆర్గానిక్ ఫుడ్‌ను రుచి చూశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగుతోందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, వూకా విజయ్‌కుమార్, దంపూరి భాస్కర్‌యాదవ్, రాజారెడ్డి, బుల్లెట్ రమణ, నాగిడి విజయలక్ష్మి, కల్పన యాదవ్, రేవతి, హరిప్రసాద్, నైనార్ శ్రీనివాస్, ఆముదాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ వీసీ సచ్చిదానందమూర్తికి ఘన నివాళి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 25: ఎస్వీయూ మాజీ వీసీ సచ్చిదానందమూర్తికి ఘన నివాళి అర్పించారు. సచ్చిదానంద మూర్తి శత జయంతిని ఫిలాసఫీ విభాగంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఫిలాసఫీ హెడ్ ప్రొఫెసర్ చంద్రయ్య మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీ ఫిలాసఫీ ప్రొఫెసర్‌గా, గుంటూరు పీజీ సెంటర్ ప్రిన్సిపాల్‌గా, 1975-78లో ఎస్వీయూ వీసీగా విశేష సేవలు అందించారని కొనియాడారు. ఫిలాసఫీని లోతుగా అధ్యయనం చేయడంతో పాటు అనేక గ్రంథాలను రాశారని గుర్తు చేశారు. అధ్యాపకులు శ్రీనివాసనాయక్, నాగలూరి దయాకర్, జయరామయ్య పాల్గొన్నారు.

మన్నవరం పరిశ్రమపై చర్చ


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: మన్నవరంలోని ఎన్‌డీబీపీఎల్-బీహెచ్‌ఈఎల్ పరిశ్రమను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సందర్శించారు. పరిశ్రమ కోసం కేటాయించిన భూములు, అందులో నిర్మాణం జరిగిన, ఖాళీగా ఉన్న స్థలం వివరాలను అధికారుల ద్వారా ఆరా తీశారు. పరిశ్రమ ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు రాంబాబునాయుడు, చెంచయ్యనాయుడు, టి.ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నరకచతుర్దికి సెలవు మంజూరు చేయండి

తిరుపతి రూరల్, సెప్టెంబరు 25: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని నరక చతుర్దశికి ప్రభుత్వం సెలవు మంజూరు చేయాలని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల కోరారు. ఈ విషయమై సంఘ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబుకు లేఖ ద్వారా విన్నవించామని ప్రకటించారు. అలాగే హిందూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు కార్తీక, మార్గశిర మాసాల్లో పూజల నిమిత్తం ప్రత్యేకంగా ఒక గంట అనుమతించాలని కోరారు.

టీటీడీని రక్షించాలి

తిరుపతి(లీగల్), సెప్టెంబరు 25: సనాతన ధర్మాన్ని కాపాడి టీటీడీని రక్షించాలని న్యాయవాద పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది వజ్రాల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం తిరుపతి కోర్టు ప్రాంగణం బయట ఆందోళన చేపట్టారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు చిలకూరి రాజశేఖర్, నారాయణ, గాలి మధు, రాజేష్, మునెయ్య, సంపత్ పాల్గొన్నారు.

బాలూకు ఘన నివాళి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 25: ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. చిత్ర పరిశ్రమకు ఆయన లేని లోటు తీర్చలేనిదని అన్నారు. సంస్థ అధ్యక్షుడు గుండాల గోపినాథ్, కార్యదర్శి కేఎన్.రాజ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

షార్‌లో సతీష్ థావన్ జయంతి



సతీష్ థావన్ విగ్రహం వద్ద షార్ డైరెక్టర్, ఉద్యోగులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 25: ఇస్రో మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ సతీష్ థావన్ జయంతిని బుధవారం షార్‌లో నిర్వహించారు. షార్ డైరెక్టర్ అర్ముగం రాజరాజన్ చేతుల మీదుగా షార్‌లోని మిషన్ కంట్రోలర్ సమీపంలో ఉన్న సతీష్ థావన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ మాట్లాడుతూ శ్రీహరికోటలోని షార్ కేంద్రం ఏర్పాటుకు సతీష్ థావన్ ఎనలేని కృషి చేశాడని కొనియాడారు. అనంతరం షార్ వైద్యశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 123 మంది రక్తదానం చేశారు. సూళ్లూరుపేట షార్ ఉద్యోగుల కాలనీ పులికాట్ నగర్ కేఆర్‌పాలెం ఉన్న సతీష్ థావన్ మెమోరియల్ హాస్పిటల్‌లో థావన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులు రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ అహ్మద్, గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను సాధించుకోవాలి

గూడూరు, సెప్టెంబరు 25: విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదివి సాధించుకోవాలని నెల్లూరు ఎంజీ బ్రదర్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ఒరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ పద్ధతుల నుంచి పరిశ్రమలు ఆధునీ కరణ వైపు కదులుతున్నాయన్నారు. విద్యార్థులు నైపుణ్యాలను, సృజనాత్మ కతను పెంపొందించుకుని చదువుల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్, డాక్టర్ దత్తాత్రేయశర్మ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు అందించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితారెడ్డి కోరారు. ప్రభుత్వాస్పత్రిలోని వార్డులను పరిశీలించారు. ఆధునిక వైద్యానికి అవసరమైనవి తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని సూపరింటెండెంట్ విజయలక్ష్మితో చెప్పారు. తుప్పు పట్టిన ఐవీ స్టాండ్లు, మంచాలు మార్చి ఐక్యూ స్థాయి నాణ్యత పరికరాలను త్వరలో ఆస్పత్రికి సమకూరుస్తామని చెప్పారు. డయాలసిస్ కేంద్రంలో విద్యుత్, నీటి సరఫరా సమస్య లేకుండా పరిష్కరించాలని వివరించారు. టీడీపీ నాయకులు విజయకుమార్, మునిరాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపండి



మేళచ్చూరులో రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు అన్నారు. శ్రీకాళహస్తి మండలం మేళచ్చూరులో పొలం పిలుస్తోందిలో భాగంగా రబీలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఏడీఏలు పీపీ ధనంజయరెడ్డి, రమేష్‌రెడ్డి, ఏవో సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: రైతులు ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ శాస్త్రవేత్త సుధాకర్ చెప్పారు. మండలంలోని ఎస్‌ఎల్‌పురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏవో మురళీకృష్ణకుమార్ ప్రారంభించారు.ఆరుతడి పంటలతో లాభాలను పొందవచ్చన్నారు. మినుము, పెసర, మిర్చి తదితర పంటలతో పాటు ఉద్యానపంటలకు సాగు చేయాలన్నారు. ఉద్యానవన అధికారి రాధారాణి, వ్యవసాయ మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చాటూరు: మండలంలోని తులసిక్కష్టాపురం, కొత్త గొల్లకండ్రిగల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ సతీష్, తిరుపతి డీఆర్సీ ఏడీఏ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో జరిగింది. డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు సిద్ధంగా ఉన్నాయని 90 శాతం రాయితీతో ఇస్తామన్నారు. అలాగే పనిముట్లు, మైక్రో న్యూట్రియంట్ జిప్సం కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఏవో సంజీవరెడ్డి, సిబ్బంది ప్రశాంత్, ప్రశాంతి పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండలంలోని సాతంబేడు, సంతవేలూరుల్లో వ్యవసాయాధికారులు పర్యటించారు. వరిసాగులో నూతన యాజమాన్య పద్ధతులను వివరించారు. పశువులకు వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశువైద్యాధికారులు వివరించి టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ద్వారకనాథ్, విస్తరణ అధికారి ప్రవీణ్, పవన్, గీర్వాణి, ప్రసాద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: డాక్టర్ రాధాకృష్ణన్ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు గుమ్మడి మురళిని బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు తన స్వగృహంలో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నిజాయితీ, నిబద్ధతకు ఒకే ఒక వృత్తి ఉపాధ్యాయ వృత్తి అన్నారు. కేశవులు, శంకర్, హరినాథ్‌నాయుడు, ఆశ కిరణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన

వరదయ్యపాళెం, సెప్టెంబరు 25: పట్టణంలోని జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సరస్వతి మాట్లాడుతూ... తల్లిదండ్రులు ఇంటి వద్ద తమ పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ

వరదయ్యపాళెం, సెప్టెంబరు 25: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్లకు ఐసీడీఎస్, ప్రజాప్రగతిట్రస్టు ఆధ్వర్యంలో పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. సీడీపీవో దేవకుమారి మాట్లాడుతూ పిల్లలకు భాషాభివృద్ధి, శాస్త్రీయ పరిజ్ఞానం, అభినయ గేయాలు, ఆకారాలు, బ్రెయిన్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సూపర్‌వైజర్ యమున, ప్రజాప్రగతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో భోజన నాణ్యత పరిశీలన



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌ట భోజన నాణ్యతను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి పరిశీలించారు. బుధవారం ఆమె అన్న క్యాంటీన్ తనిఖీ చేసి భోజనాన్ని స్వయంగా వడ్డించారు. ప్రజల నుంచి అన్న క్యాంటీన్ నిర్వహణపై ఆరా తీశారు. అందరి నుంచి సానుకూలస్పందన రావడంతో సంతోషం వ్యక్తం చేశారు.

బీజేపీ ఇంటింటి సభ్యత్వాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: పట్టణంలోని నగిరి వీధిలో బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో ఇంటింటి సభ్యత్వాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద్ ప్రతి దుకాణం వద్దకు వెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదు చేయించారు. బీజేపీ సభ్యత్వం తీసుకోవాలనుకే వారు నెం.8800002024కు మిస్డ్‌కాల్ ఇవ్వాలన్నారు.

ముగిసిన స్కూల్ గేమ్స్

కోట, సెప్టెంబరు 25: కోటలోని అల్లారెడ్డి వెంకట కృష్ణారెడ్డి ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్ బుధవారం ముగిశాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 75 పాఠశాలలకు చెందిన 700మంది పోటీల్లో పాల్గొన్నారు. విజేతలను ఎంఈవో మస్తానయ్య, శైలజ అభినందించారు.

28న నెల్లూరులో అథ్లెటిక్స్

కోట, సెప్టెంబరు 25: నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 28వ తేదీన అండర్ 19 విభాగంలోని బాలబాలికలకు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ శ్రీరేష్ తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనే బాలబాలికలు 10వ తరగతి ఒరిజనల్ మార్కులలిస్టుతో హాజరుకావాలని కోరారు. 1-1-2006 తరువాత జన్మించిన వారు మాత్రమే ఈ క్రీడలకు అర్హులని అన్నారు.

సీఎంను కలసిన బొమ్మన శ్రీధర్



తడ, సెప్టెంబరు 25: రాష్ట్ర మత్స్యకార సంఘం తరపున రూ.15 లక్షల చెక్కును సీఎం రిలీఫ్‌ఫండ్‌కు అందించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ప్రత్యేకంగా కలిశారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

వాకాడు, సెప్టెంబరు 25: మండలంలోని వల్లమేడు కాంప్లెక్స్ పరిధిలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న వేణుగోపాలపురం ఉపాధ్యాయిని సుభాషిణి, పంబలి ఉపాధ్యాయిని సుష్మా ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్నారు. బుధవారం వారిని ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణయ్య, మస్తానయ్య, మాల్యాద్రి, శ్రీనివాసరావు, బాలసుబ్రహ్మణ్యం, శ్రీనివాసులురెడ్డి, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

గూడూరు, సెప్టెంబరు 25: రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరను కల్పించాలని రాష్ట్ర రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద రాష్ట్ర రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన తెలలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు మీటర్లను ఏర్పాటు చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఒక్కో రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు ఆర్థికసాయం అందజేయాలన్నారు.

మల్లాంలో పోషకాహార మాసోత్సవాలు

చిట్టమూరు, సెప్టెంబర్ 25: మండల పరిధిలోని మల్లాంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. కోట ప్రాజెక్టు సీడీపీవో మునికుమారి మాట్లాడుతూ... రక్తహీనతను అరికట్టాలంటే ఆహారంలో ఐరన్, కాల్షియం, మినరల్, విటమిన్స్ పదార్థాలను తినాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తక్కువ కర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే మునగాకు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు.

డ్రాయింగ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 25: డ్రాయింగ్ పరీక్షల్లో చెన్నూరు గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటినట్లు ప్రిన్సిపాల్ మధుసూదనబాబు బుధవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ నెలలో నిర్వహించి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షల్లో డ్రాయింగ్ లోయర్ విభాగంలో తమ పాఠశాలకు చెందిన మహేంద్ర, దినేష్, పవన్, జీ.దినేష్, హయ్యర్ విభాగంలో ప్రణయ్‌తేజ ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారన్నారు.

సీఎం సహాయనిధికి చెక్కుల అందజేత

గూడూరు అర్బన్, సెప్టెంబరు 25: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి బుధవారం పలువురు చెక్కులను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కి అందజేశారు. కోట మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన దువ్వూరు జనార్థన్‌రెడ్డి, సాగర్‌రెడ్డి రూ.లక్ష, టీడీపీ నాయకులు బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, ఆరికట్ల మస్తాన్‌నాయుడు రూ.లక్ష చెక్కులను ఎమ్మెల్యేకు అందజేశారు.

నేడు రక్తదాన శిబిరం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 25: ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ తెలిపారు.

డిజిటల్ విద్యాబోధన ఎంతో ఉపయోగకరం

తడ, సెప్టెంబరు 25: డిజిటల్ విద్యాబోధన విద్యా ర్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఎన్నో విషయాలను సొంతంగా నేర్చు కోవచ్చని ఎంఈవో మల్లికార్జున్‌రావు తెలిపారు. బుధవారం కారిజాత ప్రాథమికోన్నత పాఠశాలలో డిజిటల్ విద్యపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐఎఫ్‌పీ ప్యానల్‌లను ప్రతి పాఠశాలలో వినియోగించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

దుస్తులు పంపిణీ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 25: స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాలింతలకు దుస్తులు, పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. మనోజ్‌కుమార్, అనిత, మురళీ నాయుడు, ఎస్‌ఎల్‌ఎన్ స్వామి, ఆర్‌వీ రావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 25: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక బీసీ కాలనీ సమీపంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం పీకల్లోతు అప్పుల్లోకి నెట్టేసిందన్నారు. రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులను సీఎం చంద్రబాబు అధిగమిస్తూ అభివృద్ధికి బాటలు వేస్తూ, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తూ ముందుకు వెళుతున్నారన్నారు. మూడు వేల పింఛను నాలుగువేలకు పెంచి ప్రతినెలా ఒకటో తేదీనాడు ఇంటికి వద్దకే లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. పేదలకు మూడు పూటలా కడుపు నింపేందుకు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రానున్న దీపావళి పండుగ నుంచి మహిళలకు ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు అందజేసే పథకాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు ఆడబిడ్డనిధి పథకం ద్వారా నెలకు రూ.1500 అందజేయడం, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం తదితర పథకాలను త్వరలోనే సీఎం ప్రారంభిస్తారని వివరించారు. అనుకోని విపత్తుల కారణంగా విజయవాడలో సంభవించిన వరదలకు నష్టపోయిన వారికి మునుపెన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తోందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్న మంచి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం చెన్నూరు గ్రామానికి చెందిన బాలశంకర్, స్థానిక 7వ వార్డుకు చెందిన మంజులకు ఎమ్మెల్యే సొంత నిధులతో ట్రైసైకిళ్లను అందజేశారు. బాలింతలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, అబ్దుల్ రహీమ్, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, ఇశ్రాయిల్‌కుమార్, కరుణాకర్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పట్టాభిరామిరెడ్డి, మట్టం శ్రావణి, చంద్రనీల్, నరసింహులు, శ్రీదేవి, రాఘవరెడ్డి, నటశేఖర్, బత్తిన ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అనుభవమే రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడి: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ

పెళ్లకూరు, సెప్టెంబరు 25: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవమే రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడి అని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం పెళ్లకూరు మండలంలోని పునబాక గ్రామంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీమంత్రి పరసా రత్నం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయ భాస్కర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే విజయశ్రీ పాల్గొన్నారు. వంద రోజుల కూటమి ప్రభుత్వం పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ నిర్వాహకం వల్ల రూ.11 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన అపారమైన అనుభవమే పెట్టుబడిగా రాష్ట్రాభివృద్ధికి బాటలు వేశారన్నారు. రాష్ట్రం సంక్షోభంలో ఉన్నా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు సమప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పింఛన్ల పెంపు, డీఎస్సీ ప్రకటన స్థానిక సంస్థలకు రూ.1452 కోట్లు మంజూరు వంటి చర్యలు తీసుకుని ప్రజలకు సంతృప్తికర పాలన అందిస్తున్నారు. మాజీమంత్రి పరసా రత్నం మాట్లాడుతూ సేవాభావం కలిగిన సీఎం చంద్రబాబు 74ఏళ్ల వయసులో కూడా వెనుకంజ వేయకుండా విజయవాడ వరదల్లో బాధితులను ఆదుకునేందుకు ఆయన చూపిన చొరవ దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందన్నారు. అర్ధరాత్రుల్లో ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లలో ప్రయాణించి బాధితులకు అండంగా నిలిచారని కొనియాడారు. ఇలాంటి నాయకుడు రాష్ట్రానికి శాశ్వత సీఎంగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో అబ్జర్వర్ ఏడుకొండలు, నాయకులు వేలూరు మురళీకృష్ణారెడ్డి, ఎద్దల నరేంద్రరెడ్డి, నాగేంద్రప్రసాద్‌రెడ్డి, పేరం రమేష్‌నాయుడు, రాజగోపాల్‌రెడ్డి, శివకుమార్, పాలచ్చూరు సుబ్బరామయ్య, పార్థసారధి, శేఖర్‌నాయుడు, కృష్ణమనాయుడు, మురళీనాయుడు, గోపాల్‌రెడ్డి, చైతన్యకృష్ణారెడ్డి, సిద్దులయ్య నాయుడు, హరినాయుడు, తాళ్ల యుగందర్‌గౌడ్, వెంపళ్ల వెంకటేశ్వర్లు, గంగాబత్తిన రామకృష్ణ, కేవీ నాయుడు, ప్రసాద్‌నాయుడు, మోహన్‌నాయుడు, అక్కరపల్లి మాధవ రెడ్డి కాటంరెడ్డి మల్లిఖార్జునరెడ్డి, రాకేష్‌రెడ్డి, పోలయ్య, బెన్నీ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ



విత్తనశుద్ధి విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 25: బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల తెగుళ్లను అరికట్టవచ్చని నాయుడుపేట వ్యవసాయశాఖ అధికారి గణేష్ తెలిపారు. బుధవారం మండలంలోని అన్నమేడు, పుదూరు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులకు విత్తనశుద్ధి చేయడం వల్ల కలిగే లాభాలను, బీజామృతం ఎలా చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గూడూరు అర్బన్: మండలంలోని వెందోడు, కాండ్ర గ్రామాలలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏవో రమేష్ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేసుకుని, అందుకు అనుగుణంగా ఎరువులను వాడుకోవాలన్నారు. సాగులో మెలుకువలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి కార్తీక్, పశువైద్యుడు సుదర్శన్, వెంకటేశ్వర్లురాజు, చక్రి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని వంజివాక, కొక్కుపాడు, రైతు సేవా కేంద్రాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులకు పంటలసాగు, దిగుబడులపై అవగాహన కల్పించారు. వరిపైర్లకు చీడపీడలు సోకడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు.

సూళ్లూరుపేట: రైతులు పంటల సాగులో భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడితే అధిక దిగుబడులలు సాధించవచ్చునని ఏవో కవిత అన్నారు. బుధవారం మండల పరిధిలోని సుద్ధమడుగు తాగేలి, మంగానెల్లూరులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకురాలు శ్రావణి, వెంకటేశ్వర్లు, కవిత తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారిణి గీత అన్నారు. మండలంలోని రావిగుంటపాళెం, వల్లమేడు పంచాయతీలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి నారుమళ్లు సిద్ధం చేసిన నేపథ్యంలో కిలో వరి విత్తనాలకు ఒక గ్రాము కార్బనైజం లీటరు నీటితో కలిపిన ద్రావణంతో ఒక రోజు నానపెట్టి నారుమడిలో చల్లడం వల్ల అగ్గితెగులు, ఆకుమచ్చ, పొడ తెగుళ్లను అదుపు చేయవచ్చన్నారు. భూసార పరీక్షలు, నీటి యాజమాన్యం కలుపు నివారణ, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తీపలపూడి రమణయ్య, ఇంగిలాల బుజగేంద్ర, విజయశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు చీదరించుకున్నా వైసీపీ నేతలకు బుద్ధి రాలేదు: నెలవల



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, సెప్టెంబరు 25: ఐదేళ్ల పాలనలో వైసీపీ నాయకులు వ్యవహరించిన తీరుతో విసిగిపోయిన ప్రజలు గత ఎన్నికల్లో చీదరించుకుని కేవలం 11 సీట్లకే పరిమితం చేసినా ఆ పార్టీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పునబాక సచివాలయ ఆవరణలో ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీమంత్రి పరసా రత్నంతో కలసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వైసీపీ నాయకులు ఇంకా వారే అధికారంలో ఉన్నట్లుగా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. తమ కుటుంబంపై ఎంతో నమ్మకంతో తన కుమార్తెకు ఆశీర్వదించి గెలిపిం చారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మండల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. అలాగే నాయకులకు, కార్యకర్తలకు తమ కుటుంబం అండంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో వేణుంబాక మునిరా మయ్య, ప్రసాద్‌రెడ్డి, కిలారి గోపీ, గోళ్ల చంద్రశేఖర్‌యాదవ్, కురిమేటి ఉదయ్ కుమార్, నరేంద్ర, రవి నాయుడు, గంగాబత్తిన గురవయ్య, సురేష్ నాయుడు, రవినాయుడు, ప్రసాద్ యాదవ్, బడికాల శ్రీనివాస్, కాండ్ర రమణయ్య, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన సీసీలకు పోస్టింగులు ఇవ్వాలి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 25: వెంకటగిరి నియోజకవర్గం డక్కిలి వెలుగు కార్యాలయంలో సీసీలుగా పనిచేస్తున్న సునీత, మంజులను సస్పెండ్ చేయడం దారుణమని రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య అన్నారు. దళిత ఉద్యోగులైన మంజుల, సునీతను ఎటువంటి కారణాలు లేకుండా తొలగించారని, వెంటనే వారికి పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 25: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఎస్పీ సుబ్బరాయుడు పోలీసులను ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక పోలేరమ్మ అమ్మవారి గుడి, కుమ్మరి ఇళ్లు, సాకలి ఇళ్లు, రాజావీధి, పాత బస్టాండ్ ప్రాంతాలను పరిశీలించారు. క్యూలైనులో భక్తుల తోపులాట లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ కంట్రోల్ పాయింట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీవీఐపీలకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు, వారి వాహనాలు పార్కింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి జాతరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు వస్తున్నారని బందోబస్తుతో అమ్మవారి దర్శనం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవిమనోహరచారి, డీఎస్పీ రమణ కుమార్, సీఐ రమణ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



పూలతో అమ్మవారి ముఖం

అన్నిదారులూ వెంకటగిరి వైపే

వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర బుధవారం వైభవంగా మొదలైంది. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, ప్రకాశం, అన్నమయ్య, కడప జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో వెంకటగిరి పట్టణం జనంతో కిక్కిరిసిపోయింది. పట్టణంలో అడుగడుగున ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వచ్చింది. ట్రాఫిక్ ఆంక్షలు గురువారం మరింత పటిష్టం చేయనున్నారు.

ఏరులైపారుతున్న మద్యం

పట్టణంలో మంగళవారం రాత్రి నుంచే మద్యం అమ్మకాలు నిలిపివేసినా ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి విక్రయిస్తున్నారు. దీంతో మందుబాబుల ఆగడాలు శృతిమించి పోయాయి. తమిళనాడు, బెంగళూరు, హైదరాబాద్ నుంచి మద్యం అక్రమంగా వెంకటగిరి పట్టణంలోకి ప్రవేశిస్తున్నట్లు తెలిసింది. మద్యం నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు నామమాత్రంగా మారాయన్న విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.







అమ్మవారి ఆలయం ఎదుట పూల అలంకరణ - వెయ్యికళ్ల దుద్దలతో కళాకారుల నృత్య ప్రదర్శన - విద్యుత్ దీపాలతో రాజావీధి అమ్మవారి ఆర్చి సెంటర్

ఆగమోక్తంగా శాంతి హోమం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం శాంతి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పరమ శివుడి జన్మ నక్షత్రం ఆరుద్రను పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు ఆలయ ఆవరణలోని 16 కాళ్ల మండపం వద్ద కలశాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలను, హోమాలను ఆగమోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈవో చంద్రశేఖర్ ఆజాద్, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.45కోట్లు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ. 1,45,87,352 వచ్చింది. ఆలయంలోని గురు దక్షిణామూర్తి సన్నిధి వద్ద హుండీ లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీలతో పాటూ పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా 68 గ్రాముల బంగారం, 421.200కిలోల వెండి, విదేశీ కరెన్సీ 3,452 వచ్చింది. 28 రోజుల వ్యవధిలో ఈ ఆదాయం వచ్చినట్టు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: సివిల్ సప్లైస్ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సివిల్ సప్లైస్ గోదాము వద్ద హమాలీలు నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ పాత అగ్రిమెంట్ పూర్తై 9 నెలలు కావస్తున్నా ఇంత వరకు కొత్త ఒప్పందం చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కొత్త హమాలీలకు పీఎఫ్ కార్డులు ఇవ్వాలన్నారు. జె.గురవయ్య, గోపి, ఎం.శివకుమార్, తులసీరాజు, శ్రీనివాసులు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్య స్ఫూర్తి ఏచూరి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: సీతారాం ఏచూరి నిత్య స్ఫూర్తి అన్ని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో బుధవారం సంతాప సభ నిర్వహించారు. ఆయనకు ఎమ్మెల్యే సతీమణి రిషితారెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ సీతారం ఏచూరి మరణం కమ్యూనిస్టు పార్టీలకే కాకుండా యావత్ భారతావనికి తీరని లోటన్నారు. అంజూరు శ్రీనివాసులు, బత్తెయ్యనాయుడు, పులి శ్రీకాంత్, షరీఫ్, టీడీపీ నాయకులు విజయకుమార్‌నాయుడు, మునిరాజానాయుడు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు అందించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితారెడ్డి కోరారు. ప్రభుత్వాస్పత్రిలోని వార్డులను పరిశీలించారు. ఆధునిక వైద్యానికి అవసరమైనవి తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని సూపరింటెండెంట్ విజయలక్ష్మితో చెప్పారు. తుప్పు పట్టిన ఐవీ స్టాండ్లు, మంచాలు మార్చి ఐక్యూ స్థాయి నాణ్యత పరికరాలను త్వరలో ఆస్పత్రికి సమకూరుస్తామని చెప్పారు. డయాలసిస్ కేంద్రంలో విద్యుత్, నీటి సరఫరా సమస్య లేకుండా పరిష్కరించాలని వివరించారు. టీడీపీ నాయకులు విజయకుమార్, మునిరాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

అదనపు కట్నం వేధింపుల కేసులో

నిందితుడికి మూడేళ్ల జైలు



సూరిబాబు

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 25: అదనపు కట్న వేధింపుల కేసులో మండలంలోని నెత్తం గ్రామానికి చెందిన సూరిబాబుకు మూడేళ్ల జైలు శిక్ష పడింది. ఈ మేరకు పుత్తూరు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పి.వేణుగోపాల కృష్ణ తీర్పును వెలువరించారు. సూరిబాబు భార్య భారతి ఫిర్యాదు మేరకు పుత్తూరు పోలీస్ స్టేషన్‌లో అదనపు కట్న వేధింపుల కేసు నమోదైంది. ఈ క్రమంలో వాదోపవాదాలు ముగిసిన క్రమంలో సూరిబాబుకు మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధించారు. ఏపీపీ నయీం, మునిషా బేగం బాధితురాలి తరపున కేసును వాదించారు.

పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి



పుత్తూరు, సెప్టెంబరు 25: పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని పుత్తూరులోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కోటకొండ బాబు మాట్లాడుతూ బీజేపీకి ఆయన పునాదులు వేశారని కొనియాడారు. ప్రతి బూత్ కమిటీ సభ్యులను చేర్చాలని కోరారు. నియోజకవర్గ కన్వీనర్ హరిబాబు, భక్తవత్సలం, శంకర్, కార్తీక్, రామ్మూర్తిరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుత్తూరు, సెప్టెంబరు 25: పట్టణంలో 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏఈ జయసాయి తెలిపారు. అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మున్సిపాలిటీలోని సమస్యలను పరిష్కరించండి



కమిషనర్‌కు సీపీఎం నాయకుల వినతి

పుత్తూరు టౌన్, సెప్టెంబరు 25: మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడకు వినతిపత్రం అందజేశారు. పలు వార్డుల్లో చెత్త పేరుకుపోయిందన్నారు. శ్మశాన వాటికను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయడమే కాకుండా మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వీధుల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని విన్నవించారు.సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేష్, నందయ్య, రమేష్, విజయ్, పళణి, సుబ్రమణ్యం తదతరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహా రుద్రాభిషేకం



వడమాలపేట, సెప్టెంబర్ 25: పట్టణంలోని భవానీ శంకర ఆలయంలో మహాశివుడిని జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా మహా రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం ఉదయం మహాలింగానికి వేదమంత్రాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. రుద్ర గమకాలు పటిస్తూ భక్తుల శివనామ స్మరణల నడుమ మహారుద్రాభిషేకం జరిగింది. వేదపండితులు శివ, సాయి ఆధ్వర్యంలో లింగాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి మంగళహారు తులి చ్చారు. కల్లూరుకు చెందిన సుధాకర్‌రెడ్డి దంపతులు అన్నదానం చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



గర్భిణులకు సారె అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం అందిస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి మండలంలోని మేలచ్చూరులో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తయిన సందర్భంగా ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యతను సచివాలయ సిబ్బంది నిబద్ధతతో వ్యవహరించాలన్నారు. అలాగే ప్రతి ఇంటి నుంచి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వానికి నివేదించాలన్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయన్నారు. ప్రజలకు కూటమి ప్రభుత్వంతో స్వేచ్ఛ ఏర్పడి వందరోజులైందన్నారు. దీపావళి నుంచి రాష్ట్రప్రభుత్వం మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయబోతోందని తెలిపారు. అంతకుముందు పోషన్ మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. గర్భిణులకు చీర, పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాదరావు, తహసీల్దారు లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకుడు చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే ప్రజా సంక్షేమం







ఆదవరంలో కరపత్రాలు, స్టిక్కర్ల పంపిణీ - ఎస్ఎస్‌పురం ప్రజావేదికలో ప్రసంగిస్తున్న శ్రీపతిబాబు - మడిబాకలో కరపత్రాల పంపిణీ

నాగలాపురం, సెప్టెంబరు 25: రాష్ట్రం సంక్షేమ బాటలో నడవాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీపతిబాబు అన్నారు. మండలంలోని ఎస్ఎస్ పురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఆయన మాట్లాడుతూ.. ఈ వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను సమర్థవంతంగా అమలు చేసిందన్నారు. దోపిడీ, దౌర్జన్యాలు, అవినీతి అధికార దుర్వినియోగంతో సాగిన పాలనకు చమరగీతం పాడుతోందన్నారు. అలాగే అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం మండల నాయకులతో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, జనసేన మండల అధ్యక్షుడు మణికంఠన్, తెలుగు మహిళ అధ్యక్షురాలు యమున, టీడీపీ నాయకులు పార్తిబన్, సురేష్‌యాదవ్, మాతయ్య, ప్రేమ సెల్వకుమార్, మురళి, ఎస్ఎం సురేష్, రుద్రయ్య పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండలంలోని సీఎల్ఎన్‌పల్లి పంచాయతీ మిట్ట హరిజనవాడలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సత్యవేడు మండలం ఈటీపాకంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: సీఎంగా చంద్రబాబు అధికారం చేపట్టి 100 రోజులు పూర్తైన సందర్భంగా సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు తెలి పారు. ఆదవరంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గోపినాథ రెడ్డి, సురేష్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, మాజీ సర్పంచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని మడిబాక పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సంక్షేమ కరపత్రాలను అందించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ హయాంలో రాష్ట్రం సుభి క్షంగా ఉంటుందన్నారు. రవినాయుడు, చెంగల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ఆరా



గోవిందప్ప నాయుడు కండ్రిగలో కలెక్టర్

నారాయణవనం, సెప్టెంబర్ 25: మండలంలోని గోవిందప్ప నాయుడు కండ్రిగలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వెంకటేశ్వర్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. అనంతరం సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అలాగే సచివాలయ సిబ్బంది ఇంటింటి వెళ్లి స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రశ్నావళిలో నోట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయరాములు, సంబంధింత మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భెల్ పరిశ్రమ అధికారులతో భేటీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: మండలంలోని మన్నవరంలో ఎన్‌టీపీసీ బీహెచ్ఈఎల్ పరిశ్రమను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సంయుక్తంగా సందర్శించారు. పరిశ్రమ కోసం కేటాయించిన భూములు, అందులో నిర్మాణం జరిగిన, ఖాళీగా ఉన్న స్థలం వివరాలను అధికారుల ద్వారా ఆరా తీశారు. అనంతరం పరిశ్రమ ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు రాంబాబునాయుడు, చెంచయ్యనాయుడు, తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీనదయాళ్ జయంతి వేడుకలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: పట్టణంలోని పాతబస్టాండు కూడలి వద్ద బుధవారం బీజేపీ వ్యవస్థాపకుడు పండిత్ దీనదయాళ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ హాజరైనారు. అనంతరం ప్రజలకు స్వీట్లుపంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో జి.రమేష్‌బాబు, ఎం.సుబ్రహ్మణ్యంరెడ్డి, అమర్‌నాథ్, పుణ్యం డిల్లీకుమార్, సుకుమార్, వెంకటేశ్వర్లు, లిఖిత్‌సాయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. శ్రీరామనగర్‌కాలనీలో జిల్లా బీజేపీ అధ్యక్షులు చంద్రప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే సుధీర్



పాలకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రేణిగుంట, సెప్టెంబరు 25: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చెప్పారు. బుధవారం సాయంత్రం రేణిగుంట మండలం అత్తూరులో పాల కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారి పట్టెడలోని 66 ఎకరాల ఇనాం భూమిలో దశాబ్దాలుగా తాము సేద్యం చేసుకుంటున్నామని తమకు పట్టాలు ఇప్పించాలని కోరారు. సిమెంటు రోడ్లు, పాఠశాలకు మైదానం, వంతెన నిర్మించాలని, కబ్జాకు గురైన వంక భూములను స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. నెలలో రెండు రోజులు ప్రతి మండలానికి కేటాయించి అక్కడ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి స్థానిక సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. కబ్జాకు గురైన వంక భూమిని స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం



హోమం నిర్వహిస్తున్న జనసేన నాయకులు

రేణిగుంట, సెప్టెంబరు 25: ఉపముఖ్యమంత్రి పవన్ తీసుకున్న ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత మంచినీళ్ల గుంట సమీపంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో హోమం నిర్వహించారు. ఇందుకు మద్దతుగా స్థానిక ముస్లిం మహిళలు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పల్లం హాస్టల్ తనిఖీ



కూరగాయల తోట పరిశీలనలో ఎంఈవో

ఏర్పేడు, సెప్టెంబరు 25:మండలంలోని పల్లం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఏర్పేడు ఎంఈవో 2 దయాకర్ తనిఖీ చేశారు. హాస్టల్‌లో మరుగుదొడ్లు, విద్యార్థుల భోజనశాల, వంట గది సహా పరిసరాలను పరిశీలించారు. అదే విధంగా హాస్టల్‌లో పండిస్తున్న కూరగాయల తోటను పరిశీలించారు. వార్డెన్ రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



చికిత్స పొందుతున్న రామకృష్ణ, మానస

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. తొట్టంబేడు దళితవాడకు చెందిన రామకృష్ణ టైలర్. ఆయన భార్య మానస గృహిణి. వీరిద్దరు ద్విచక్ర వాహనంపై పొయ్య గ్రామంలో బుధవారం బంధువుల ఇంటికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కన్నలి గ్రామం వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై వెళ్తుండగా వెనుకవైపు నుంచి కారు ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన దంపతులను స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రుయాకు రెఫర్ చేశారు.

శ్రీకాళహస్తిలో మోస్తరు వర్షం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: పట్టణంలో బుధవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగి మేఘావృతమై సుమారు రెండు గంటల పాటు వర్షం కురిసింది. దీంతో వేడితో అల్లాడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. రాత్రి వరకు అడపదడపా కురుస్తూనే ఉంది.

గుండెపోటుతో ఎమ్మెల్యే సోదరుడి మృతి



పాండురంగం (ఫైల్‌ఫొటో)

నారాయణవనం, సెప్టెంబర్ 25: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తమ్ముడు పాండురంగం(68) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. మండలంలోని భీమునిచెరువుకు చెందిన పాండురంగం రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురి కావడంతో కుటుంబీకులు ఆయన్ను చికిత్స నిమిత్తం స్విమ్స్‌కు తరలించారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం పాండురంగంకు గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

30న చలో కలెక్టరేట్

వరదయ్యపాళెం, సెప్టెంబరు 25: గత కొద్ది నెలలుగా తమకు జీతాలు ఇవ్వడం లేదని, దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని గ్రీన్ అంబాసిడర్లు వాపోయారు. సత్యవేడు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షుడు శేఖర్, కార్యదర్శి మునస్వామి మాట్లాడుతూ... జీతాల కోసం ఈనెల 30న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

సైన్స్‌పై మక్కువ పెంచుకోండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: సైన్స్‌పై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని జన విజ్ఞాన వేదిక కార్యదర్శి చెంచయ్య, ఉపాధ్యక్షుడు మునీశ్వర్‌రెడ్డి చెప్పారు. తొట్టంబేడు మండలం గుండేలిగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.

రేణిగుంట: పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్టును నిర్వహించారు. పట్టణంలోని 10 ప్రభుత్వ, 5 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 8, 9, 10వ తరగతి విద్యార్థులు ఈ టాలెంట్ టెస్టులో పాల్గొన్నారు.

మురుగుకాలువ శుభ్రం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రేణిగుంట, సెప్టెంబరు 25: మిరియాలబాబా వీధిలోని మురుగునీటి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పంచాయతీ పారిశుధ్య సిబ్బంది తొలగించారు. 'ఆ వీధిలో అడుగడుగునా కంపే!' వార్తా కథనం బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. స్పందించిన అధికారులు కాలువలను శుభ్రం చేయించారు. బ్లీచింగ్ చల్లించారు. పల్లంగా ఉన్న ఈ ప్రాంతంలో వర్షం పడినపుడు మురుగు పారకుండా కాల్వ ఎత్తు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

28న మహాజన సభ

పిచ్చాటూరు, సెప్టెంబరు 25: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సహకార సంఘం సభ్యులతో 2023-24 ఆడిట్ రిపోర్టుపై ఈ నెల 28న శనివారం ఉదయం 11 గంటలకు మహాజన సభ జరుగుతుందని పీఏసీఎస్ ఎక్స్ అఫిషియో పర్సన్ ఇన్‌చార్జి హేమంత్‌కుమార్, ముఖ్య నిర్వహణ అధికారి దొరసామి తెలిపారు. కార్యక్రమంలో ఆడిట్ రిపోర్టును పరిశీలించి ఆమోదిస్తారని తెలిపారు. సభకు సహకార సంఘ సభ్యులు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

29న కడూరులో...

వరదయ్యపాళెం, సెప్టెంబరు 25: మండలంలోని కడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ మహాజన సభ 29వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని పర్సన్ ఇన్‌చార్జి అమరవేలు, సీఈవో సంపత్‌కుమార్ తెలిపారు. పలు అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సభ్యులు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

షాట్ పుట్‌లో కావ్య ప్రతిభ



నాగలాపురం, సెప్టెంబరు 25: నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో సత్యవేడులో జరిగిన షాట్ పుట్ విభాగంలో నాగలాపురం మండలం కారణి జడ్పీ హైస్కూల్ విద్యార్థిని కావ్య మొదటి స్థానంలో నిలిచింది. అండర్ 14 బాలికల విభాగంలో పాల్గొన్న కావ్య ప్రతిభను కనబరిచింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయకుమారి, పీఈటీ దాముతో పాటూ ఉపాధ్యాయులు అభినందించారు.

నియోజకవర్గస్థాయి ఖోఖో పోటీలు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 25: పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీలను జడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో సత్తా చాటి జాతీయ స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. అండర్-17, 14 విభాగాల్లో విజేతగా సత్యవేడు, రన్నర్‌గా వరదయ్యపాళెం నిలిచాయి. మండలం, హెచ్ఎం రమణయ్య, పీఈటీలు పాల్గొన్నారు.

ముచ్చివోలులో పశువైద్యశిబిరం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: మండలంలోని ముచ్చివోలులో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల మిషన్ పథకం కింద పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, రైతులకు అవగాహన సదస్సు, లేగదూడ ప్రదర్శన బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రవికుమార్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తి ఏడీ డాక్టర్ ఎన్‌వీ శ్రీకాంత్‌బాబు, డాక్టర్ ఊహ తదితరులు పాల్గొన్నారు.